


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 218 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 18 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 218 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 18 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## విద్యతోనే జీవితాల్లో మార్పు..

### ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు

- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు.రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు. దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై

- మిగతా 2లో

## విద్యుత్ ఉద్యోగులకు తీపికబురు..

# 1.62% డీఏ పెంపు

### రాష్ట్రవ్యాప్తంగా 70,804 మంది సిబ్బందికి ప్రయోజనం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారి కరువు భత్యాన్ని (డీఏ) 1.62 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,804 మంది ఉద్యోగులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరాలను వెల్లడించారు.రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, ఎక్కడా అంతరాయం కలగకుండా నిరంతర సరఫరా కోసం శ్రమిస్తున్న ఉద్యోగుల పనితీరును ప్రభుత్వం గుర్తించిందని భట్టి విక్రమార్క తెలిపారు. టీజీ ట్రాన్స్‌కో,

- మిగతా 2లో

## నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చిన

- మిగతా 2లో

## ఇచ్చిన హామీ ఫైళ్లకే పరిమితం కాకుండా చూడాలి



- పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ.. కాగితాలపై కాదు క్షేత్రస్థాయిలో చూపించాలన్న హరీశ్ రావు
- తెలంగాణ పరిధిలో ముంపు ప్రాంతాలను ఆదుకుంటామన్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ
- పీపీఏ రక్షణ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్న హరీశ్ రావు

- మిగతా 2లో



## గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ..

### ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ


**హైదరాబాద్ పెన్ పవర్:** గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలను గుర్తించేందుకు సమగ్ర

- మిగతా 2లో

## 'ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం'

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

- అమెరికా-ఇరాన్ ఒప్పందంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదన్న అమెరికా అధ్యక్షుడు
- ఇరాన్ ప్రవర్తనపై కూడా ఘాటు వ్యాఖ్యలు
- ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు సందర్భంగా వ్యాఖ్యలు
- ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా చర్చ



- మిగతా 2లో



## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

### ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం

- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం

- భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
- మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
- ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
- జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ

- మిగతా 2లో




## తెలంగాణలో ఆగని వడగాల్పులు.. జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

- తెలంగాణలో జూన్ 20 వరకు కొనసాగనున్న పొడి వాతావరణం
- ఉత్తర, తూర్పు జిల్లాలకు మూడు రోజుల పాటు వడగాల్పుల హెచ్చరిక
- సూర్యాపేట జిల్లా మోతేలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- హైదరాబాద్, భద్రాచలం వరకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు
- రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు

- మిగతా 2లో





## ఇక బ్యాంకుల ఇష్టం చెల్లదు..

### అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు!

- బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన నిబంధనలు
- లోన్ కోసం బీమా పాలసీ కొనాలని బలవంతం చేయొద్దు
- ప్రతి ఉత్పత్తికి విడిగా కస్టమర్ అంగీకారం తప్పనిసరి
- డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం
- 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

- మిగతా 2లో

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

### సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

- సైబర్ నేరగాళ్లను సమాజానికి పరాన్నజీవులతో పోల్చిన సుప్రీంకోర్టు
- ఆన్‌లైన్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
- అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్య
- ఎఫ్ఐఆర్‌ల విలీనానికి హైకోర్టులను ఆశ్రయించాలని నిందితుడికి సూచన
- ఇలాంటి నేరస్థులను జైల్లో ఉంచడమే సమాజానికి శ్రేయస్కరం అని వ్యాఖ్య



- మిగతా 2లో




## కారు స్పీడ్ పెరిగిందా.. కాన్ఫిడెన్స్ ఎక్కువయింది అందుకేనటగా?

తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు.

**ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా...**

సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ వ్యతిరేక ఓటు...**

ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

### ఇక బ్యాంకుల ఇష్టం చెల్లదు..

## అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు!

బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరం లేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది.

కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం.వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ఒక ఉత్పత్తికి ఇచ్చిన అంగీకారాన్ని మరో ప్రొడక్ట్‌ను వర్తింపచేయకూడదు. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే.డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపై కూడా ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది.లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయం చేసుకోవడం కూడా నిషేధం.ఈ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి వినియోగదారుడికి తప్పుడు ప్రొడక్ట్‌ను విక్రయించినట్లు తేలితే బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. వినియోగదారుడు ఎదుర్కొన్న నష్టానికి పరిహారం కూడా ఇవ్వాల్సి రావచ్చు.

## తెలంగాణలో ఆగని వడగాల్పులు.. జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి.

బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏదుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది.ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4-5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20-21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత 2-3 డిగ్రీల మేర తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

# విద్యతోనే జీవితాల్లో మార్పు..

## ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు

- మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు.విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు.క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు.

సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు.

విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## ఇచ్చిన హామీ ఫైళ్లకే పరిమితం కాకుండా చూడాలి

తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస-పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం.2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది.

తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది.ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది

- మొదటి పేజి తరువాయి

పవన్ కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు."అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ తన పోస్టులో వివరించారు.

**తెలంగాణ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు**

ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా వరంగల్, హనుమకొండ

పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.

### గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణ..

## ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

- మొదటి పేజి తరువాయి

సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని.. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులను గుర్తించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి రెండు వేల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసినందున.. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు టార్పాలిన్ షీట్లు, రేకులు, నాపరాళ్లతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వాటిని గుర్తించి స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి చెప్పారు.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం

భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు.ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు.

వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని,

త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు.

ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## విద్యుత్ ఉద్యోగులకు తీపికబురు.. 1.62% డీఏ పెంపు

- మొదటి పేజి తరువాయి

టీజీ జెన్‌కో, టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ వంటి అన్ని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ డీఏ పెంపు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. 2035 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్న అంచనాలు నేపథ్యంలో, ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని పెంపొందించడం అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్ సంస్థల సిబ్బందికి కాలానుగుణంగా డీఏ సవరించడం సాధారణ ప్రక్రియలో భాగమేనని అధికారులు వెల్లడించారు.

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది."మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది.

ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## 'ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం'

అమెరికా-ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది.ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్.. అమెరికా-ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు.

"ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం" అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..


రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి.ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

# గిటార్ వాయించి.. ఫుట్‌బాల్ ఆడి..



హైదరాబాద్ పెన్ పవర్:అనంతరం గ్రంథాలయం, మ్యూజిక్ క్లబ్, ప్రయోగశాలలను సీఎం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కొద్దిసేపు గిటార్ వాయించారు. ప్రయోగశాలలో మైక్రోస్కోప్‌ను పరిశీలించారు. మైదానంలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) హెచ్‌వోడీ గిరిధర్‌గౌడ్, ఉపాధ్యాయుల బృందంతో గ్రూప్ ఫొటో దిగారు. పాఠశాలను చక్కగా తీర్చిదిద్దారంటూ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని, పేరెంట్స్ కమిటీ సభ్యులను ముఖ్యమంత్రి అభినందించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



## 140 గొర్రెలు మృతి.. కాపరికి అండగా షబ్బీర్ అలీ..

- బస్వాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం..!
- ప్రభుత్వ సహాయంపై కలెక్టర్‌తో మాట్లాడిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..
- 140 గొర్రెల మృతితో భారీగా నష్టపోయిన కాందూరి సాయిలు..
- బాధిత కుటుంబాన్ని బుధవారం కలిసిన షబ్బీర్ అలీ సాయిలుకు భరోసా..
- మిగిలిన గొర్రెలకు వెంటనే వైద్య సేవలు అందించాలని డాక్టర్‌కు ఆదేశం..

-5 లో

## ఇద్దరు నేరస్తులు..! 12 పోలీస్ స్టేషన్‌లలో కేసులు..!

- 12 పోలీస్ స్టేషన్‌లలో కేసులకు సంబంధం ఉన్నట్టు వెల్లడి..
- 6 బైకులు, 23 మొబైళ్లు, 2 కంప్యూటర్లు, 95 గ్రాముల గంజాయి స్వాధీనం..
- గంజాయి సేవిస్తుండగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు వెల్లడి..
- దొంగల వద్ద కొనుగోలు చేసిన ఇద్దరు రిసీవర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.
- కేసులను ఛేదించిబ పోలీసులను ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ అభినందించారు..
- బుధవారం ప్రెస్‌మీట్‌లో నిందితులను ప్రవేశ పెట్టి, రిమాండ్‌కి తరలించారు..

-4 లో

- కామారెడ్డి పోలీసుల ఆపరేషన్‌లో ఇద్దరు ప్రధాన నిందితులు, ఇద్దరు రిసీవర్లు అరెస్ట్..!
- వరుస నేరాలకు పాల్పడిన.. ఇద్దరు ముఠా సభ్యుల అరెస్ట్‌తో సంచలన నిజాలు..
- తీగలాగితే డొంక కదిలింది.. పోలీసుల విచారణలో దొంగల బాగోతం బట్టబయలు..






## 'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లు తొలగించే అవకాశం ఉంది

- 'సర్'తో ముస్లింలను టార్గెట్ చేస్తారన్న అజారుద్దీన్
- ప్రజలు తమ ఓట్లను కాపాడుకోవాలని సూచన
- తనకు తెలుగు చదవడం, రాయడం వచ్చని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ఉపయోగించి ముస్లింల ఓట్లను తొలగించే అవకాశం ఉందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఈరోజు

-4 లో

## కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత

- బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను మూసేశానని వ్యాఖ్య
- తన కొత్త పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'తోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్న కవిత



హైదరాబాద్ పెన్ పవర్:తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావుతో గానీ, ఆ పార్టీతో గానీ తిరిగి కలిసే ప్రసక్తే లేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయమని, ఆ పుస్తకాన్ని తాను ఇప్పటికే పూర్తిగా మూసేశానని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. తన నూతన పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ద్వారానే సరికొత్త చరిత్రను లిఖిస్తానని ఆమె ఉద్ఘాటించారు.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కవిత, ఒకవేళ కేసీఆర్ తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తే వెళ్తారా? అన్న ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చారు. "ఖచ్చితంగా ఆ అధ్యాయం ముగిసింది. జీవితంలో కొన్నిసార్లు పేజీలు తిప్పాలి, మరికొన్నిసార్లు పుస్తకాలనే మూసివేయాలి. నేను బీఆర్ఎస్ అనే పుస్తకాన్ని ఎప్పుడో మూసివేశాను" అని ఆమె పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్‌లో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆమె బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పార్టీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్త రాజకీయ పార్టీని స్థాపించారు.

బీఆర్ఎస్ పాలనలో తనకు అనేక చేదు అనుభవాలు ఎదురయ్యాయని, సామాజిక న్యాయం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు వంటి హామీలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయిందని కవిత విమర్శించారు. ప్రాంతీయ భావజాలం నుంచి బీఆర్ఎస్

-4 లో



## రోజుకు రూ.2.5 కోట్లు

సర్కారుపై పెరుగుతున్న వడ్డీ భారం


మెట్రోకు రుణం మంజూరులో జాప్యం ఫలితం

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లకు లీగల్ నోటీసులు.. 'టీజీ20 లీగ్' వివాదంలో సినీ, క్రీడా ప్రముఖులు!

- టీజీ20 లీగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా సినీ, క్రీడా ప్రముఖులు
- బీసీసీఐ నుంచి టీజీ20 లీగ్‌కు అనుమతులు లేవన్న హెచ్‌సీఏ
- లీగ్ ప్రమోషన్లపై సదరు ప్రముఖులు ఆలోచన చేయాలన్న టీసీఏ



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' చుట్టూ ఇప్పుడు ఊహించని లీగల్ ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరోలు వెంకటేష్, విజయ్ దేవరకొండలతో పాటు పలువురు స్టార్ క్రికెటర్లకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ద లీగల్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు స్పోర్ట్స్ అండ్ సినీ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది.

**బీసీసీఐ అనుమతి లేదు – టీసీఏ సంచలన ఆరోపణలు:** భారత క్రికెట్ నియంత్రణ మండలి

-4 లో

## కాంగ్రెస్‌కు విధ్వంసం తప్ప వికాసం తెలియదు



- 20 లక్షల ఇళ్లు కట్టాకే పొంగులేటి ఓట్లు అడగాలి
- భూమిశిస్తు పెట్టి రైతులను మళ్లీ ఇబ్బంది పెడతారా?
- రాష్ట్రాన్ని సీఎం, మంత్రులు దోచుకుంటున్నారు
- పాలేరు భారాస కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్ పెన్ పవర్: ఆరు గ్యారంటీల పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి.. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు దోచుకుంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని వెంకటగిరి వద్ద బుధవారం పార్టీ బీఎల్‌ఏలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని

-4 లో

- 12 పోలీస్ స్టేషన్‌లలో కేసులకు సంబంధం ఉన్నట్టు వెల్లడి..
- 6 బైకులు, 23 మొబైళ్లు, 2 కంప్యూటర్లు, 95 గ్రాముల గంజాయి స్వాధీనం..
- గంజాయి సేవిస్తుండగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు వెల్లడి..
- దొంగల వద్ద కొనుగోలు చేసిన ఇద్దరు రిసీవర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.
- కేసులను ఛేదించిబ పోలీసులను ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ అభినందించారు..
- బుధవారం ప్రెస్‌మీట్‌లో నిందితులను ప్రవేశ పెట్టి, రిమాండ్‌కి తరలించారు..






# ఇద్దరు నేరస్తులు..! 12 పోలీస్ స్టేషన్‌లలో కేసులు..!

బండారు భాస్కర్.. కామారెడ్డి జిల్లా(ప్రతినిధి), పెన్ పవర్, జూన్ 17:

కామారెడ్డి జిల్లాలో పోలీసులకు పట్టుబడిన, ఇద్దరు నేరస్తుల ముఠాకు సంబంధించిన కేసుల చిట్టా 12 పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్టు ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ బుధవారం పత్రికా సమావేశంలో వెల్లడించారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా సీసీఎస్, టౌన్ పోలీసుల సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో వరుస నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసిన ఘటనలో పోలీసుల, విచారణలో సంచలన నిజాలు బయటపడ్డాయి.. నేరస్తులు ఇద్దరే అయినప్పటికీ, 12 పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నట్టు విచారణలో తేల్చారు.. 12 కేసుల్లో భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.. ఈ కేసుల్లో చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.. పోలీసుల కథనం ప్రకారం, జూన్ 17న కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో డీలక్స్ బేకరీ సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం అందడంతో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై సాయి కృష్ణ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 95 గ్రాముల గంజాయి లభించింది.. విచారణలో నిందితులు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోటార్ సైకిల్ చోరీలు, మొబైల్ ఫోన్ దోపిడీలు, హౌస్ బ్రేకింగ్, షట్టర్ లిఫ్టింగ్ వంటి ఆస్తి నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు..




- కామారెడ్డి పోలీసుల ఆపరేషన్‌లో ఇద్దరు ప్రధాన నిందితులు, ఇద్దరు రిసీవర్లు అరెస్ట్..!
- వరుస నేరాలకు పాల్పడిన.. ఇద్దరు ముఠా సభ్యుల అరెస్ట్‌తో సంచలన నిజాలు..
- తీగలాగితే డొంక కదిలింది.. పోలీసుల విచారణలో దొంగల బాగోతం బట్టబయలు..

## దర్యాప్తు బృందాన్ని ఎస్పీ అభినందనలు..

వరుస ఆస్తి నేరాలను ఛేదించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు దొంగిలించబడిన ఆస్తులను స్వాధీనం చేసుకున్న కామారెడ్డి సీసీఎస్, టౌన్ పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.. ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు.. ప్రజలు తమ ద్విచక్ర, 4 వీల్ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయడం తోపాటు స్టీరింగ్, వీల్ లాక్‌లను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. మొబైల్ ఫోన్లలో స్క్రీన్ లాక్, ట్రాకింగ్ సదుపాయాలను యాక్టివేట్ చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల వినియోగం లేదా నేర కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు..

## పోలీసులు ఛేదించిన 12 కేసులు..

కామారెడ్డి జిల్లా పోలీసుల అరెస్ట్ చేసిన నిందితులపై 12 పోలీస్ స్టేషన్‌లలో కేసుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. (1)..జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ Cr.No.32/2026 -మోటార్ సైకిల్ చోరీ.. (2)..బాచుపల్లి పోలీస్ స్టేషన్ Cr.No.561/2026 -స్కూటర్ చోరీ.. (3)..భిక్నూర్ పోలీస్ స్టేషన్ Cr.No.225/2026 అండర్ సెక్షన్ 309(4) - మొబైల్ ఫోన్ చోరీ.. (4)..దేవునిపల్లి పోలీస్ స్టేషన్ Cr.No.255/2026 -రాబరీ.. (5)..రాజంపేట్ పోలీస్ స్టేషన్ Cr.No.83/2026 -మొబైల్ ఫోన్ దోపిడీ.. (6)..మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో Cr.No.126/2026 -మొబైల్ ఫోన్ దోపిడీ.. (7).. కామారెడ్డి పోలీస్ స్టేషన్ Cr.No.460/2026 -రాబరీ.. (8)..పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో Cr.No.310/2026 -షట్టర్ లిఫ్టింగ్.. (9) ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ Cr.No.335/2026 -బార్‌లో చోరీ.. (10)..యాదాద్రి భువనగిరి పోలీస్ స్టేషన్ Cr.No.214/2026 -షట్టర్ లిఫ్టింగ్.. (11)..జనగామా పోలీస్ స్టేషన్‌లో Cr.No.307/2026 హౌస్ బ్రేకింగ్ యత్నం.. (12)..జనగామా పోలీస్ స్టేషన్ జతీ.చీశీ.302/2026 మోటారు సైకిల్ చోరీ..

## నిందితులు ఇద్దరూ ఒకే కుటుంబీకులు..

గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితులు ఇద్దరూ, ఒకే కుంటుంబానికి చెందిన, (ఎ-1) తిలిపితియ రూబిన్ సింగ్ అలియాస్ రూబీన్ సింగ్ (23), తండ్రి సంచి సింగ్, రాజీవ్ నగర్ కాలనీ, కామారెడ్డి.. (ఎ-2) మంగళ్ సింగ్ (21), తండ్రి పూజారి సింగ్, రాజీవ్ నగర్ కాలనీ, కామారెడ్డి.. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారని, గంజాయి, మద్యం వ్యసనాలతో పాటు ఇతర అవసరాల కోసం డబ్బు సంపాదించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వరుస ఆస్తి నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.. నిందితులపై పన్నెండు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్టు ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు..

## ఇద్దరి తోపాటు.. మరో ఇద్దరు అరెస్ట్..

నిందితుల నుండి పోలీసులు స్వాధీన పరచుకున్నవి 6 మోటార్ సైకిళ్లు, 23 మొబైల్ ఫోన్లు, 2 డెస్క్‌టాప్ కంప్యూటర్లు 95 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.. చోరీకి గురైన ఆస్తిలో అధిక భాగాన్ని తిరిగి రికవరీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.. వీరివద్ద చోరీ సొమ్మును, కొనుగోలు చేసి, క్రయవిక్రయాలకు సహకరించిన ఇద్దరు వ్యక్తులను కూడా పోలీసులు అరెస్టు చేశారు.. (ఎ-3).. షేక్ ముజాహిద్ (25), అజంపురా, కామారెడ్డి.(ఎ-4)..ఆసం రాజేందర్ (35), కల్కినగర్ రోడ్ నెం.3, కామారెడ్డి.. వీరు కామారెడ్డికి చెందిన సమీర్, శివల సహాయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి దొంగిలించిన మొబైల్ ఫోన్లను అన్‌లాక్ చేయించి విక్రయాలకు సహకరించినట్లు విచారణలో తేలింది..






# ‘సర్’ ప్రక్రియతో ముస్లింల ఓట్లు తొలగించే అవకాశం ఉంది

-3 పేజి తరువాయి

గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి అజారుద్దీన్... ‘సర్’ అందరికీ వర్తించే అంశమే అయినా, ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారు అని ఆరోపించారు.

పశ్చిమబెంగాల్, బీహార్‌లలో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలోనూ అలాంటి కుట్రలు జరగవచ్చని హెచ్చరించారు. ‘సర్’ ప్రక్రియలో తొలగించే ఓట్ల మీదే ఎన్నికల ఫలితాలు ఆధారపడతాయని, ప్రజలు తమ ఓట్లను స్వయంగా కాపాడుకోవాలని మంత్రి సూచించారు. తాను తెలుగులో మాట్లాడటం కొంత ఇబ్బందిగా ఉంటుందని అజారుద్దీన్ స్పష్టం చేశారు. “తెలుగు చదవడం, రాయడం వచ్చు. చిన్నప్పుడు ప్రాక్టీస్ చేశాను. కానీ మాట్లాడటం సులభంగా ఉండదు. తప్పులు వస్తే ఇబ్బందిగా ఉంటుంది. సులభంగా ఉండే భాషలోనే మాట్లాడతాను” అని వివరించారు.

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు. విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 200 మందికి పైగా ప్రజల సమస్యలు పరిష్కరించానని, పబ్లిసిటీపై తనకు మోజు లేదని అన్నారు.

## కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీతో రాజీపడే ప్రసక్తే లేదన్న కవిత

-3 పేజి తరువాయి

వైదొలగడం వల్లే ప్రజలకు దూరమైందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీయే తమ ప్రధాన ప్రత్యర్థి అని, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

స్లీప్ మోడ్‌లోకి వెళ్లిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. ఇక ఢిల్లీ మద్యం కేసులో తనపై దిగువ కోర్టులో ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, ఈడీ, సీబీఐ అప్పీళ్ల అంశాన్ని న్యాయవ్యవస్థకే వదిలేస్తున్నానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లకు లీగల్ నోటీసులు.. ‘టీజీ20 లీగ్’ వివాదంలో సినీ, క్రీడా ప్రముఖులు!

-3 పేజి తరువాయి

నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హెచ్‌సీఏ ఈ టీజీ20 లీగ్‌ను అక్రమంగా నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ స్పష్టం చేసింది. బోర్డు పర్మిషన్ లేని లీగ్‌ను సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం చట్టప్రకారం తప్పని వేలెత్తి చూపింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ లీగ్ పేరు వాడుకుంటూ కార్పొరేట్ కంపెనీలతో హెచ్‌సీఏ రూ. వందల కోట్ల బిజినెస్ చేస్తోందని టీసీఏ మండిపడింది. ఇది కేవలం యువ క్రికెటర్లను, స్పాన్సర్లను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించింది.

అక్రమ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారంటూ టీసీఏ కింది ప్రముఖులకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపింది:

సినీ ప్రముఖులు: రౌడీ హీరో విజయ్ దేవరకొండ, విక్టరీ వెంకటేష్.

క్రికెట్ స్టార్స్: టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్, యువ సెన్సేషన్ తిలక్ వర్మ, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు.బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేస్తూ సాగుతున్న ఈ లీగ్ ప్రమోషన్లపై సదరు ప్రముఖులు వెంటనే పునరాలోచన చేయాలని.. లేనిపక్షంలో చట్టపరంగా కఠినమైన న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ గట్టిగా హెచ్చరించింది.


# కాంగ్రెస్‌కు విధ్వంసం తప్ప వికాసం తెలియదు

-3 పేజి తరువాయి

ప్రశ్నించారు. హిట్లర్ తనకు ఆదర్శమని చెప్పుకొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారని, తన అనుచరుల ప్రయోజనాలు, రియల్ దందా కోసం ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో వెయ్యి ఇళ్లు కూలగొట్టించారని ఆరోపించారు. విధ్వంసం తప్ప.. కాంగ్రెస్‌కు వికాసం తెలియదని దుయ్యబట్టారు. రైతులను భూమిశిస్తు పేరిట గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పీల్చిపిప్పి చేస్తే.. భారాస హయాంలో కేసీఆర్ దాన్ని తొలగించారని, ఇప్పుడు మళ్లీ రైతులపై భూమిశిస్తు భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేటీఆర్ ఆరోపించారు. “ఖమ్మం నుంచి కరీంనగర్ వరకు, ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఎక్కడికి వెళ్లినా.. ఎవరిని కదిలించినా ఒక్కటే మాట.. మళ్లీ సీఎంగా కేసీఆర్ రావాలని. ఈ విషయంలో ముఖ్యమంత్రికి, మంత్రులకు స్పష్టత ఉంది. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ధోరణిలో దందాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో రెవెన్యూ పడిపోతుంటే.. ఆ శాఖ మంత్రి అవినీతి సామ్రాజ్యం వందల, వేల రెట్లుగా పెరిగిపోతోంది. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంటే.. ఆ శాఖ మంత్రి అక్రమాలు రోజుకొకటి బయటపడుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంటే.. ఆ శాఖ మంత్రి ఆదాయం, కమీషన్ల దందా జోరుగా సాగుతోంది.

**దివాలా స్థితిలో ఖమ్మం జిల్లా..**

రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే తాను వచ్చి ఓట్లడుగుతానని ఇచ్చిన హామీకి మంత్రి పొంగులేటి కట్టుబడి ఉండాలి. రాష్ట్రంలో కోటి ఎకరాలను వివాదాస్పద జాబితాలో పెట్టి వాటిని దోచుకుంటున్నారు. రెండేళ్ల కిందట పొంగులేటి నివాసంపై ఈడీ దాడి చేసి రూ.వందల కోట్లు పట్టుకున్నా.. కనీసం ఒక ప్రకటన, కేసు కూడా లేదు. దీనిపై భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఎందుకు మాట్లాడడంలేదు? శ్రీనివాసరెడ్డి చీకట్లో అదానీ, మోదీల వద్ద మోకరిల్లడమే కారణమా? పొంగులేటి అక్రమాలను భారాస కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం చేయాలి. ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లా ఇప్పుడు దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. భారాస పాలనలో ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును 80 శాతం పూర్తిచేసి పాలేరు ప్రాంతానికి నీళ్లు తీసుకొచ్చాం. ఖమ్మం జిల్లాకు మెడికల్, నర్సింగ్ కాలేజీలు, అనేక గురుకులాలొచ్చాయి. మరి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రూ.4 లక్షల కోట్ల అప్పుతో ఏం ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేస్తారా? ఎన్నికలు ఎప్పుడొచ్చినా పాలేరులో గులాబీ జెండా ఎగురుతుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను భారాస కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ప్రక్రియలో ఓట్లు కోల్పోయిన తీరు, ఎన్నికల ఫలితాలను గుర్తుంచుకోవాలి. ప్రతి ఓటును విలువైనదిగా గుర్తించి కాపాడుకోవాలి” అని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, రవీందర్‌రావు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ..

బస్వాపూర్‌లో బాధిత గొర్రెల యజమానికి షబ్బీర్ అలీ ఆర్థిక సాయం..

# 140 గొర్రెలు మృతి...
# కాపరికి అండగా షబ్బీర్ అలీ

- బస్వాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం..!
- ప్రభుత్వ సహాయంపై కలెక్టర్‌తో మాట్లాడిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ..
- 140 గొర్రెల మృతితో భారీగా నష్టపోయిన కాందూరి సాయిలు..
- బాధిత కుటుంబాన్ని బుధవారం కలిసిన షబ్బీర్ అలీ సాయిలుకు భరోసా..
- మిగిలిన గొర్రెలకు వెంటనే వైద్య సేవలు అందించాలని డాక్టర్‌కు ఆదేశం..

**భిక్నూర్, పెన్ పవర్, జూన్ 17:** వింత వ్యాధి సోకిన గొర్రెలు మృతి చెందిన ఘటనలో గొర్రెల కాపరికి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆర్థిక సాయంచేసి భరోసాను అందించారు.. ప్రభుత్వం నుండి సహాయం చేసేందుకు కృషి చేస్తానని, ఆ గొర్రెల యజమాని కాందూరి సాయిలుకి ఆయన హామీ ఇచ్చారు.. కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం, బస్వాపూర్ గ్రామానికి చెందిన, కాందూరి సాయిలుకు ఉన్న, 140 గొర్రెలకు వింత వ్యాధి సోకి, వెంట వెంటనే, మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయాడు.. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, గొర్రెల కాపరి కుటుంబానికి మానవతా దృక్పథంతో వ్యవహరించి అండగా నిలిచారు.. ఇటీవల జరిగిన ఈ ఘటనతో జీవనాధారాన్ని కోల్పోయి ఆందోళనలో ఉన్న బాధితుడు కాందూరి సాయిలును బుధవారం స్వయంగా వెళ్ళి పరామర్శించిన షబ్బీర్ అలీ, రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి కుటుంబానికి భరోసా ఇచ్చారు.. బుధవారం బస్వాపూర్ గ్రామానికి చేరుకుని ఘటనపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.. గొర్రెల మృతితో కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.. బాధితుడికి అన్ని విధాలా తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు..

## కలెక్టర్‌తో మాట్లాడిన షబ్బీర్ అలీ..

బాధితులను పరామర్శించిన అనంతరం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన షబ్బీర్ అలీ, బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మిగిలిన గొర్రెల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే వైద్య సేవలు అందించాలని సంబంధిత వెటర్నరీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గొర్రెలపైనే జీవనాధారంగా ఉన్న కుటుంబాలకు ఇలాంటి ఘటనలు తీవ్ర దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని, అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బస్వాపూర్ సర్పంచ్ తుడుం పద్మ, భిక్నూర్ సర్పంచ్ రేఖ, గుర్జకుంట సర్పంచ్ సంతోష్ రెడ్డి, భిక్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బాగారెడ్డి, సిద్దారములు, జీవన్, ఎంఆర్‌ఓ, వెటర్నరీ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..





బాధితులు, స్థానికులతో కలిసి గొర్రెలను పరిశీలిస్తున్న చిత్రం..



# రోజుకు రూ.2.5 కోట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను స్వాధీనం చేసుకునేందుకు మంజూరైన రూ.13,527 కోట్ల రుణ ఒప్పందం అమల్లో జాప్యం సర్కారుకు గుదిబండగా మారే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఒప్పందం కుదిరి 20 రోజులు దాటినా ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ) సదరు సొమ్ము విడుదల చేయడం లేదు. ఆలస్యానికి సాంకేతిక అంశాలు కారణమా, ప్రభుత్వం ఆరోపించినట్లుగా రాజకీయ కోణమా అనేది పక్కనపెడితే.. రుణం మంజూరులో జాప్యంతో ప్రభుత్వంపై రోజుకు సరాసరిన రూ.రెండున్నర కోట్ల భారం పడుతోంది.
మెట్రో రైలు మొదటి దశను ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 29న ఒప్పందం చేసుకుంది. రూ.1,461 కోట్ల ఈక్విటీ చెల్లించి వంద శాతం షేర్లను కొనుగోలు చేసింది. అప్పటివరకు మెట్రోపై ఉన్న రూ.13,538 కోట్ల అప్పును ప్రభుత్వం పేరు మీదకు బదలాయించుకునేలా ఒప్పందం కుదిరింది. అయితే.. గతంలో మెట్రో నిర్మాణం కోసం సంస్థ తీసుకున్న అప్పుల తాలూకు వడ్డీ రేట్లు అధికంగా ఉండటంతో రుణాలను రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. అంతమొత్తం రుణంగా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీ ముందుకొచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ(హెచ్‌ఎంఆర్‌ఎల్), ఎల్ అండ్ టీ మెట్రోరైలు(హైదరాబాద్) లిమిటెడ్, ఐఆర్‌ఎఫ్‌సీ మధ్య మే నెల 25న దిల్లీలో త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. మే నెలాఖరు నాటికి రుణం మంజూరైతే జూన్ 1 నుంచి మెట్రో మొదటిదశ సర్కారు యాజమాన్యంలోకి రావడంతో పాటు వడ్డీభారం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

**ఇప్పటికే రూ.130 కోట్లకు..**

మెట్రో స్వాధీన ఒప్పందం కుదిరిన ఏప్రిల్ 29 నుంచే అప్పులపై వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం, రుణ మంజూరు ప్రక్రియ నెల రోజుల్లో పూర్తవుతుందని.. వడ్డీ భారం సుమారు రూ.80 కోట్ల వరకు భరించాల్సి వస్తుందని సర్కారు లెక్కలేసింది. ఒప్పందం కుదిరి 20 రోజులు దాటినా ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణం మంజూరు కాకపోవడంతో ప్రభుత్వంపై వడ్డీ భారం రోజురోజుకు పెరుగుతోంది. వడ్డీ ఇప్పటికే రూ.130 కోట్లు దాటింది.

**షరతులన్నింటికీ అంగీకరించినా..**

రుణం మంజూరు విషయంలో ఐఆర్‌ఎఫ్‌సీ విధించిన అన్ని షరతులకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. గ్యారంటీ కూడా ఇచ్చింది. నేరుగా ఆర్‌బీఐ నుంచే రుణం తాలూకు కిస్తీ జమ చేసుకునేలా షరతు విధించగా...దానికీ అంగీకరించింది. ఆ తర్వాతే త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. మే నెలాఖరులోగా రుణం మంజూరవుతుందని ప్రభుత్వం ఆశించింది. అలా జరగకపోవడంతో ఈ నెల రెండో వారంలో దిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. మెట్రో రెండో దశకు అనుమతులతో పాటు ఐఆర్‌ఎఫ్‌సీతో కుదిరిన ఒప్పందం ప్రకారం రుణం విడుదలకు సహకరించాలని కోరారు. అయినా విడుదల కాలేదు.

**రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కావాలంటున్నారు**

వచ్చిన ఆదాయాన్ని మొదట మెట్రో నిర్వహణ, ఆ తర్వాత రుణ చెల్లింపులు చేసేలానే ఐఆర్‌ఎఫ్‌సీతో ఒప్పందం కుదిరిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మెట్రోకు నెలవారీగా టికెట్ల ద్వారా వచ్చే రాబడి, అద్దెలు, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని, రుణ వాయిదాలు చెల్లించగలరనే ధీమాతోనే ఆరు నెలల చర్చల అనంతరం ఐఆర్‌ఎఫ్‌సీ రుణం మంజూరు చేసిందని తెలిపాయి. 'రుణ మంజూరులో ఆలస్యానికి కారణాలు చెప్పడం లేదు. ఇంకేమైనా సాంకేతిక వివరాలు కావాలని కూడా ఐఆర్‌ఎఫ్‌సీ అధికారికంగా అడగలేదు. అంతర్గతంగా విచారిస్తే రైల్వే మంత్రిత్వశాఖ నుంచి క్లియరెన్స్ కావాలని చెబుతున్నారు' అని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. రూ.13,527 కోట్ల రుణాన్ని మంజూరు చేసే అధికారం కేవలం ఐఆర్‌ఎఫ్‌సీ అధికారులకు ఉండదని, సంబంధిత బోర్డు, మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తర్వాతే ఒప్పందం దశకు వచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# మెట్రో లో బ్లేమ్ గేమ్

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేయాల్సిన మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణ ప్రాజెక్టు ఇప్పుడు తీవ్రమైన రాజకీయ చదరంగంలో చిక్కుకుంది. కేవలం మౌలిక వసతుల ప్రాజెక్టుగా సాగాల్సిన మెట్రో వ్యవహారం కాస్తా, ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర రాజకీయ యుద్ధానికి దారితీసింది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మొదటి దశ మెట్రోను దాదాపు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ముగిసిందని, జపాన్ ఆర్థిక సాయంతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా తక్కువ వడ్డీకి రూ. 13,600 కోట్ల రుణం లైన్ క్లియర్ అయిందని భావిస్తున్న తరుణంలో కేంద్రం నుంచి బ్రేకులు పడ్డాయనే వార్త ఒక్కసారిగా దుమారం రేపింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ సంస్థ మొదటి దశలో భారీ నష్టాలు రావడంతో రెండో దశ 122 కిలోమీటర్ల విస్తరణను చేపట్టేందుకు నిరాకరించిందని తెలిపారు. కేంద్రం సూచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం రూ. 30,000 కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ. 15,000 కోట్లకు కొనుగోలు చేయడానికి సిద్ధపడిందని, జపాన్ సంస్థ నుంచి వచ్చిన రూ. 13,600 కోట్ల రుణాన్ని ఐఆర్ఎఫ్సీ ద్వారా కేవలం 4 శాతం వడ్డీకే రీఫైనాన్స్ చేయడానికి అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేశామని చెప్పారు. రాష్ట్ర వాటాగా రూ. 1,400 కోట్లు కూడా చెల్లించామన్నారు. అయితే, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి రాజకీయ కారణాలతో, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌లను కలిసి ఈ నిధుల బదిలీని అడ్డుకున్నారని రేవంత్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. కిషన్ రెడ్డి పగలు బీజేపీలో, రాత్రి వేళ బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ కేంద్రానికి ఇష్టం లేకపోతే ఎన్ఓసీ ఇస్తే రాష్ట్రమే పూర్తి భారాన్ని మోస్తుందని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అంతే తీవ్రంగా ఖండిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్–2 కు వ్యతిరేకం కాదని, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇప్పటికే దీనికి సూత్రప్రాయ ఆమోదం తెలిపారని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం నిధులు కేంద్రమే ఇవ్వబోతోందని, ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసేటప్పుడు సమగ్ర పరిశీలన అవసరమని పేర్కొన్నారు. తనపై రేవంత్ రెడ్డి చేస్తున్నవన్నీ అభూతకల్పనలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యం చెందిందని, ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించడానికే ఈ మెట్రో డ్రామా ఆడుతున్నారని రివర్స్ అటాక్ చేశారు. సీనియర్ జర్నలిస్టులతో కమిటీ వేసి నిజాలు నిరూపిస్తే తాను రాజీనామాకైనా సిద్ధమని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఈ వివాదంలోకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు కూడా ఎంట్రీ ఇచ్చారు. మెట్రో ప్రాజెక్టు ఆలస్యానికి, రుణాల నిలిపివేతకు రేవంత్ రెడ్డి పరిపాలనా అసమర్థతే కారణమని ఆయన విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే మెట్రో మొదటి దశను విజయవంతంగా పూర్తి చేశామని, తాము సిద్ధం చేసిన ఫేజ్–2 రూట్ మ్యాప్‌లను మార్చడం వల్లే ప్రాజెక్ట్ గందరగోళంలో పడిందని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నిధులు తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్, బీజేపీలు కలిసి కుట్ర చేస్తున్నాయంటూ రేవంత్ రెడ్డి కొత్త కథలు అల్లుతున్నారని విమర్శించారు. ఈ ముక్కోణపు రాజకీయ యుద్ధం మధ్య నలిగిపోతున్నది మాత్రం సగటు హైదరాబాద్ పౌరుడే. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, చాంద్రాయణగుట్ట, నాగోల్ కారిడార్లను అనుసంధానిస్తూ ప్రతిపాదించిన 122 కిలోమీటర్ల భారీ విస్తరణ ఇప్పట్లో పట్టాలెక్కేలా కనిపించడం లేదు. ఎల్ అండ్ టీ నుంచి మొదటి దశ మెట్రో ఆస్తుల బదిలీ, రుణాల టేకోవర్ సవ్యంగా సాగితేనే రెండో దశకు అంతర్జాతీయ బ్యాంకుల నుంచి నిధులు సమకూరుతాయి. ఇప్పుడు ఐఆర్ఎఫ్సీ లోన్ క్లియరెన్స్ పెండింగ్‌లో పడటం ప్రాజెక్టు టైమ్‌లైన్‌ను దెబ్బతీస్తుంది. టెక్నికల్ కారణాల కంటే ఇక్కడ ఇగోలు, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువైపోయాయి. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోతే మెట్రో వంటి మెగా ప్రాజెక్టులు ముందుకు పడవు. గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు ట్రాఫిక్ కష్టాలు తీరాలన్నా, రియల్ ఎస్టేట్ రంగానికి ఊపు రావాలన్నా మెట్రో ఫేజ్–2 అత్యంత కీలకం. దేశంలోని అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, వైజాగ్ వంటి నగరాలకు మెట్రో నిధులు వస్తున్నప్పుడు హైదరాబాద్‌కు ఎందుకు ఆలస్యం అవుతుందనే రాష్ట్ర ప్రభుత్వ వాదనలో కొంత నిజం ఉన్నప్పటికీ.. కేవలం ఢిల్లీపై నిందలు వేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ కూర్చుని, కేంద్ర అధికారులతో మాట్లాడి ఈ రూ. 13,600 కోట్ల లోన్ క్లియరెన్స్‌ను సాధించడమే నగరానికి శ్రేయస్కరమని లేదంటే 'మెట్రో విస్తరణ' కేవలం కాగితాలకే పరిమితమై, గాల్లో దీపంలా మారే ప్రమాదం ఉందని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్ లో కోల్డ్ వార్...



**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:**
తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన తరుణంలో.. కీలక నేతల మధ్య అభిప్రాయ బేధాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. ఇటీవల మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేసిన వ్యాఖ్యల దుమారం పూర్తిగా చల్లారకముందే.. తాజాగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన 'హిట్లర్' వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ బహిరంగంగానే అసమ్మతి వ్యక్తం చేయడం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.. పీసీసీ చీఫ్ క్లారిటీ ఇటీవల ఒక ప్రైవేట్ న్యూస్ ఛానల్ నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న మహేష్ కుమార్ గౌడ్‌కు ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఎదురైంది. గతంలో బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పాలనలో కొన్నిసార్లు హిట్లర్ లాంటి కఠిన నిర్ణయాలు కూడా అవసరమనే కోణంలో వ్యాఖ్యానించారు. దీనిపై యాంకర్ ప్రశ్నించగా పీసీసీ చీఫ్ ఏమాత్రం సంకోచించకుండా తన అసంతృప్తిని బయటపెట్టారు. "సీఎం రేవంత్ రెడ్డి చేసిన హిట్లర్ వ్యాఖ్యలతో నేను ఏకీభవించను. అది పూర్తిగా ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. హిట్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఒక క్రూరమైన నియంతగా.. విలన్‌గా భావిస్తారు. అలాంటి వ్యక్తిని ఎవరూ ఆదర్శంగా తీసుకోలేరు.. ఆయన చర్యలను సమర్థించలేం" అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అంతేకాదు ఈ అంశంపై ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టాన వర్గాల్లో కూడా అంతర్గతంగా చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించడం విశేషం. గాంధీ సిద్ధాంతాలను నమ్మే కాంగ్రెస్ పార్టీలో ఇలా నియంతల ప్రస్తావన రావడం సరికాదనే భావన ఆయన మాటల్లో వ్యక్తమైంది. హైడ్రా చర్యలపై కీలక వ్యాఖ్యలు ఇదే ఇంటర్వ్యూలో హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా పనితీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నగరంలో చెరువుల పరిరక్షణకు.. అక్రమ నిర్మాణాల తొలగింపునకు హైడ్రా చర్యలు అవసరమేనని ఆయన అంగీకరించారు. అయితే అదే సమయంలో బాధితుల పక్షాన నిలబడతానని హామీ ఇచ్చారు. హైడ్రా చర్యల వల్ల పేదలకు లేదా ఎవరికైనా అన్యాయం జరిగిందని తన వద్దకు వస్తే, వారికి ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయిలో అధికారుల తొందరపాటు చర్యల వల్ల తప్పులు జరిగి ఉండవచ్చని.. అలాంటి వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారుప్రతిపక్షాల విమర్శలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి లాంటి పీసీసీ చీఫ్ బహిరంగంగా స్పందించడం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీనిని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలు అస్త్రంగా మార్చుకున్నారు. "ముఖ్యమంత్రి వైఖరి పార్టీ నేతలకే నచ్చడం లేదనడానికి ఇదే నిదర్శనం" అని గులాబీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో తనపై వచ్చిన నెగెటివ్ కథనాల వెనుక కాంగ్రెస్ పార్టీలోని కొందరు కీలక నేతల హస్తం ఉందనే అనుమానంతో పీసీసీ చీఫ్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఆయన కొందరు ముఖ్య నేతలతో కాస్త దూరంగానే ఉంటున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మొత్తానికి షబ్బీర్ అలీ వ్యాఖ్యల వివాదం.. పీసీసీ చీఫ్‌పై మీడియా కథనాలు.. ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ ఓపెన్ స్టేట్‌మెంట్స్.. ఇవన్నీ తెలంగాణ కాంగ్రెస్‌లో 'కోల్డ్ వార్' నడుస్తోందనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఎలాంటి రాజకీయ మలుపులు తిరుగుతాయో చూడాలి

# రాములమ్మ దారెటు..

**మెదక్, జూన్ 17, పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఇప్పుడు 'రాములమ్మ' రూట్ మార్చబోతున్నారా? పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పదవిపై ఆమె అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నాయి గాంధీ భవన్ వర్గాలు. ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరిన సీనియర్ నేత, సినీ నటి విజయశాంతి.. ప్రస్తుతం పార్టీ వ్యవహారాలకు కాస్త దూరంగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. పదవులు ఉన్నా లేకపోయినా తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించే విజయశాంతి, ఇప్పుడు కాంగ్రెస్ తీరుపై కొంత అసహనంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది ఇటీవల ఆమెకు కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టింది. అసలు సీనియర్ల లిస్టులోనే లేని ఆమె పేరు తెరపైకి రావడం, నేరుగా ఢిల్లీ స్థాయిలోనే లాబీయింగ్ చేసి పదవి దక్కించుకోవడం అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. అయితే, ఈ ఎమ్మెల్సీ పదవిపై రాములమ్మ అస్సలు హ్యాపీగా లేరన్నది ఇన్‌సైడ్ టాక్. తన సీనియారిటీకి, ఇమేజ్‌కు కేవలం శాసనమండలి సభ్యురాలిగా ఉండటం సరిపోదని, తన అసలు రేంజ్ మంత్రి పదవి అని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అసంతృప్తి కారణంగానే విజయశాంతి పార్టీ అధికారిక కార్యక్రమాలకు పెద్దగా హాజరుకావడం లేదని తెలుస్తోంది. కేవలం శాసనమండలి సమావేశాలకు మాత్రమే వస్తూ,

అదీ మొక్కుబడిగా ప్రశ్నలు వేసి వెళ్ళిపోతున్నారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. పైగా, మొన్నటి మొన్న జరిగిన మండలి సమావేశాల్లో సొంత ప్రభుత్వంపైనే ఆమె కొన్ని ఘాటు వ్యాఖ్యలు చేయడం, పరోక్షంగా తన అక్కసును వెళ్లగక్కడం కాంగ్రెస్ శ్రేణులను విస్మయానికి గురిచేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే రాములమ్మ కాంగ్రెస్‌కు ఏదో ఒక గట్టి అల్టిమేటం ఇవ్వబోతున్నారా అనే అనుమానాలు రాష్ట్రంలో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో, విజయశాంతి తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇక్కడి స్థానిక నేతలతో సంబంధం లేకుండా, నేరుగా హైకమాండ్‌నే ఢిల్లీలో కలవాలని ఆమె డిసైడ్ అయినట్లు టాక్. ఇప్పటికే మంత్రి పదవుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రాహుల్ గాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా, రాములమ్మ మాత్రం ఒక పక్కా ప్లాన్‌తో హస్తిన బాట పడుతున్నారట. తనకు కనుక మంత్రి పదవి ఇస్తే.. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ మైలేజ్‌కు ఎలాంటి వ్యూహాలతో

ముందుకెళ్తానో వివరించడానికి విజయశాంతి ఒక ప్రత్యేక బ్లూ ప్రింట్ కూడా సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కాగా, గతంలో ఎవరూ ఊహించని విధంగా ఎమ్మెల్సీ పదవిని సొంతం చేసుకున్న రాములమ్మ, అదే జోష్‌తో ఇప్పుడు మంత్రి పదవిని కూడా సాధించుకుంటే ఆశ్చర్యపోనక్కర్లేదని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. మరి ఢిల్లీ పెద్దలు రాములమ్మ డిమాండ్‌కు తలొగ్గుతారా? లేదా అనేది రానున్న రోజుల్లో చూడాలి.,

# మెట్రో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేపట్టే క్రమంలో కొన్ని పాత నిర్మాణాలకు మార్పులు చేర్పులు చేయడం అనివార్యమవుతోంది. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో అత్యంత రద్దీగా ఉండే ఉప్పల్ జంక్షన్‌లో పాదచారుల భద్రత కోసం నిర్మించిన ప్రతిష్టాత్మక ఉప్పల్ స్కైవాక్‌కు ఇప్పుడు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో గండం ఎదురైంది. కారిడార్‌కు సంబంధించిన భారీ పిల్లర్ల నిర్మాణానికి స్కైవాక్ అడ్డుగా మారడంతో.. దాన్ని ఒక వైపు తాత్కాలికంగా ముక్కలుగా తొలగించేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. గతంలో ఉప్పల్ క్రాస్‌రోడ్డు దాటాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీనికి పరిష్కారంగా 2020లో రూ. 25 కోట్ల అంచనా వ్యయంతో 660 మీటర్ల పొడవు, 34 మీటర్ల వెడల్పుతో 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు, 6 మెట్ల మార్గాలతో ఈ స్కైవాక్ పనులు ప్రారంభించి 2023లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. భూమి నుంచి 6 మీటర్ల క్లియరెన్స్ ఉండే ఈ స్కైవాక్ పాదచారులకు ఎంతో సౌకర్యంగా మారింది. అయితే, తాజాగా ఉప్పల్ రింగురోడ్డు మీదుగా నిర్మిస్తున్న కొత్త ఎలివేటెడ్ కారిడార్ ఈ స్కైవాక్‌తో పాటు దానిపై నుంచి వెళ్లే మెట్రో రైలు లైన్‌ను కూడా దాటాల్సి ఉంది. అందువల్ల ఈ కారిడార్‌ను భూమి నుంచి గరిష్ఠంగా 23 మీటర్ల ఎత్తులో నిర్మించేలా డిజైన్ చేశారుఇంత భారీ ఎత్తున ఉండే ఫ్లై ఓవర్‌ను మోయడానికి ఉప్పల్ జంక్షన్ వద్ద భారీ పిల్లర్లను నిర్మించాల్సి వస్తోంది. ఈ క్రమంలో వరంగల్ జాతీయ రహదారి వైపు వెళ్లే స్కైవాక్ పిల్లర్ నంబర్ 23 ఏ నుంచి 24 వరకు ఉన్న దాదాపు 17 మీటర్ల మేర స్కైవాక్ భాగాన్ని తక్షణమే తొలగించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ తొలగింపు పనులు, పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ స్కైవాక్‌ను యథావిధిగా అమర్చడానికి అయ్యే అంచనా వ్యయాన్ని లెక్కించే బాధ్యతను ఒక ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించారు. దీనిపై క్షేత్రస్థాయి అధ్యయనం కోసం కన్సల్టెన్సీ ప్రతినిధులు మంగళవారం ఉప్పల్‌కు రానున్నారు. ఈ నిర్మాణాల కారణంగా రానున్న కొన్ని నెలల పాటు వరంగల్ రహదారి వైపు ఉన్న స్కైవాక్ మార్గాన్ని పూర్తిగా మూసివేయనున్నారు. దీనివల్ల కాలినడకన ప్రయాణించే వారికి కొన్ని ఇబ్బందులు తప్పవు. కాగా.. ఈ తాత్కాలిక తొలగింపు, పునర్నిర్మాణ ప్రక్రియకు అయ్యే పూర్తి ఖర్చును మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భరించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# జూలై 19 నుంచి బోనాలు



**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల పండగ కు అంతా సిద్ధం అయింది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన ఈ ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది ఆషాఢమాస బోనాలు.. జూలై 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ ఉత్సవాలు అధికారికంగా మొదలు కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు హైదరాబాద్ నగరం మొత్తం జరగనున్న ఈ బోనాల పండగ.. ఆగస్ట్ 10వ తేదీ వరకు అంగరంగ వైభవంగా కొనసాగుతాయని తెలిపారు. ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19వ తేదీన చారిత్రక గోల్కొండ కోటలో జగదాంబ అమ్మవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించనున్నారు. ఇక అదే రోజున హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఆదివారం, గురువారాల్లో అమ్మవారికి నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, బోనాలు సమర్పించనున్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో అతి కీలక ఘట్టాలు ఆగస్ట్ తొలి వారంలో జరగనున్నాయి. ఆగస్ట్ 2వ తేదీ ఆదివారం రోజున లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారితోపాటు ప్రధాన ఆలయాల్లో అమ్మవారికి భక్తులు భారీ ఎత్తున బోనాలను సమర్పించనున్నారు. ఆగస్ట్ 3వ తేదీ సోమవారం రోజున సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో పవిత్ర రంగం (భవిష్యవాణి) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ తర్వాత అంబారీపై అమ్మవారిని సాగనంపే ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. గోల్కొండ జగదాంబ అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభం కానున్న ఈ బోనాల జాతర.. ఆ తర్వాత లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారు.. పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాల ఉత్సవాలతో ముగియనుంది. ఆగస్ట్ 10వ తేదీన ఉమ్మడి దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపు.. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ సంవత్సరం ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. ఇక రాష్ట్ర పండగ అయిన ఈ బోనాల పండుగను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ సర్కార్ ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. నగరంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ సహా అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు, భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.

# సిద్ధి పేటలో హరీష్ రావును గద్దె దించే వరకు నిద్ర పోను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:** హరీష్ రావు, కేటిఆర్ లపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు హాట్ కామెంట్స్ చేసారు. సిద్ధి పేటలో హరీష్ రావును గద్దె దించే వరకు నిద్ర పోను. అక్కడే ఇళ్ళుకట్టుకుని ఉంటా. పెద్దాయన కేసీఆర్ ఏజ్ అయిపోయింది. రిటైర్ మెంట్ స్టేజి వచ్చింది. మనకు టార్గెట్ హరీష్ రావు, కేటిఆర్ అని అన్నారు.

బుధవారం నాడు హనుమంతరావు గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పేరు లేకుండా హరీష్ రావు,కేటిఆర్ దుకాణం బంద్ చేయాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో పెట్రో ల్ పోసి తగలబెట్టి, తెలంగాణ కోసం సచ్చిపోయారు అన్నారు. ఇప్పుడు ఈ కొడుకులు ఎంజాయ్ చేస్తున్నారు. సిద్ధి పేట,దుబ్బాక లో బీఆర్ఎస్ నేతలు వద్ద లారీలను అడ్డుకున్నారు. ఒకప్పుడు హరీష్ రావు ప్యారాగాన్ చెప్పులతో వచ్చిండు. ఇప్పుడు 5స్టార్ హోటల్స్ వేల కోట్లు వచ్చాయని ప్రశ్నించారు.

హైదరాబాద్ లో కేటిఆర్, హరీష్ రావు లు లక్షల కోట్లకు ఎదిగి పోయారు. మునుగోడు ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ సారి సిద్ధి పేటలో బులెట్ దించాలి. సిద్ధిపేట లో కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ లేక 26సంవత్సరాలు అవుతుంది. కేటిఆర్, హరీష్ రావు లు వందల కోట్లు సంపాదించారు. హరీష్ రావుకు, కేటిఆర్ కు 50 సోషల్ మీడియా లు ఉన్నాయి. అవసరం వచ్చినప్పుడు ఆంధ్రా, తెలంగాణ అని రెచ్చగొడుతారు. వాటి ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాటిని తిప్పి కొట్టాలని అన్నారు.

డబ్బులు పెట్టి సోషల్ మీడియా ను మెయింటెన్ చేస్తున్నారు. ఎన్నో కేసుల పాలు అయ్యాం. మీకోసం అడ్డంగా నిలబడటానికి నేను సిద్ధంగా ఉన్న. సుక్కలు చూపించడానికి నేను తయారు గా ఉన్న. కష్ట పడ్డ కార్యకర్తలను గెలిపించడానికి సిద్దాం ఉన్నాం. కష్ట పడ్డ కార్యకర్తల ఎన్నికలకు 200 శాతం గుర్తింపు ఉంటుంది. రెండు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయి.కార్యకర్తల కోసం వచ్చే ఎన్నికలు. కార్యకర్తలు నారాజ్ కావొద్దు. మీకోసం మేము కష్ట పడతాం. కార్య కర్తలు అనవసరంగా ఇన్వాల్వ్ అయి సోషల్ మెడియా లో పోస్ట్ లు పెట్టొద్దు. మైనం పల్లి హనుమంత రావు మాజీ కావొచ్చు. కానీ కార్యకర్తలు మాజీలు కారు. గెలిచే వారికి టికెట్లు ఇస్తాం. సిద్దిపేట కు స్పెషల్ కోటా కింద నామినేటెడ్ పదవులు వుంటాయి. జెండా మోసిన కార్యకర్తలను మర్చిపోమని అన్నారు.

# ఓవర్ నైట్ లో కింగ్ మేకర్ అయిన ఎన్ సీపీఐ

**న్యూఢిల్లీ, జూన్ 17 పెన్ పవర్:** నిన్నటిదాకా ఓ చిన్న రాజకీయ పార్టీగా ఉన్న నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) ఇప్పుడు ఒక్కసారిగా భారత రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. తృణమూల్ కాంగ్రెస్‌లో చెలరేగిన తిరుగుబాటులో ఎన్‌సీపీఐ వార్తల్లో నిలిచింది. 2023 లెక్కల ప్రకారం రూ. 75 నగదు మాత్రమే ఉన్న ఈ పార్టీ ఇప్పుడు లోక్‌సభలో కింగ్‌మేకర్‌గా మారనుంది. బెంగాల్‌లో రాజకీయ సంక్షోభం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్‌లో చీలికలు ఏర్పడ్డాయి. 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఎన్‌సీపీఐలో విలీనం అవుతామని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇస్తామని ప్రకటించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల విలీనాన్ని స్పీకర్ ఆమోదిస్తే ఇప్పటి వరకు పెద్దగా రాజకీయ ప్రభావం లేని ఎన్‌సీపీఐ ఒక్కసారిగా లోక్‌సభలో ఐదో అతిపెద్ద పార్టీగా, ఎన్డీయేలో రెండో అతిపెద్ద భాగస్వామ్య పార్టీగా అవతరించే అవకాశం ఉంది. తిరుగుబాటు ఎంపీలంతా కలిసి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి సభలో తమకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. మూడింట రెండొంతుల మద్దతు కూడా తమకు ఉందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) 2023 జనవరిలో భారత ఎన్నికల సంఘం వద్ద నమోదయింది. ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం ఈ పార్టీ కార్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లా సంకరైల్ ప్రాంతంలో ఉంది. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక ప్రకారం పార్టీకి మొత్తం రూ. 1,13,075 విరాళాల రూపంలో వచ్చాయి. దాదాపు పార్టీ మొత్తం నిధులు ఖర్చు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పార్టీ ఖజానాలో కేవలం రూ. 75 మాత్రమే మిగిలిందని ప్రకటించింది. 2023లో త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి పార్టీ ఖర్చుల్లో దాదాపు రూ. 49,400ను వినియోగించింది. ఇది పార్టీ తొలి ఎన్నికల ప్రయత్నాల్లో ఒకటిగా చెబుతున్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు షెల్లీ కుండు రూ. 15 వేల విరాళం ఇవ్వగా, ఉపాధ్యక్షుడు ఉత్తియా కుండు రూ. 18 వేల విరాళం అందించారు. 2023 – 24, 2024 – 25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విరాళాలు, ఆడిట్ నివేదికలు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రస్తుతం అందుబాటులో లేవు. మొత్తానికి రూ. 75 నగదుతో ఉన్న చిన్న పార్టీ ఇప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం ఆసక్తికరంగా మారింది.

# దేవాలయాల్లో దొంగలు పడ్డారు

**చెన్నై, జూన్ 17, పెన్ పవర్:** తమిళనాడులో మన దేశంలోనే ఎక్కువగా ఆలయాలు ఉంటాయి. దీనిని టెంపుల్ స్టేట్ అని పిలుస్తుంటారు. రామేశ్వరాలయం నుంచి మొదలుపెడితే మీనాక్షి వరకు విశిష్టమైన ఆలయాలు తమిళనాడులో ఉంటాయి. ఇక్కడ ఆలయాలు వందల ఎకరాలలో ఉంటాయి. పైగా ఆలయ పరిసర ప్రాంతాల్లోనే వాణిజ్యసముదాయాలు.. ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేశారు.. వీటిని అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వం తీసుకుంటుంది. తమిళనాడులో ఆలయాల ఆస్తుల మీద ప్రభుత్వానికి మాత్రమే హక్కు ఉంటుంది. ఇంతటి స్థాయిలో ఆస్తులు ఉన్నప్పటికీ ఆశించిన విధంగా ఆదాయం రావడం లేదు. ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలో ఉన్న పార్టీ నాయకులు అడ్డగోలుగా దోచుకోవడం మొదలుపెట్టారు. తమకు అనుకూలమైన వ్యక్తులకు ఆ వాణిజ్య సముదాయాలను అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. దేవస్థానాలకు కాకుండా .. తమ సొంత జేబుల్లోకి ఆ ఆదాయాన్ని మళ్ళించుకున్నారు. ఫలితంగా గడిచిన కొన్ని సంవత్సరాలుగా దాదాపు 60 వేల కోట్ల ఆదాయం పక్కదారి పట్టింది. వాస్తవానికి వేలకోట్ల ఆదాయం వందల కోట్లకు పడిపోయింది. ప్రభుత్వ పెద్దలకు ఇందులో పాత్ర ఉండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేకపోయారు. ఇటీవల తమిళనాడులో ఒక వ్యక్తి ఈ వ్యవహారాన్ని

సమాచార హక్కు ద్వారా బయటికి తీసుకొచ్చాడు. అంతేకాదు కోర్టు దాక కూడా వెళ్ళాడు. దీనిపై కేసు విచారణలో ఉంది. ఒకవేళ కేసు విచారణకు వస్తే తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా దోషిగా

నిలబడుతుంది. ఒకవేళ కోర్టు ఆ డబ్బు మొత్తం చెల్లించాలని చెప్పినప్పటికీ ఎవరు చెల్లిస్తారు.. ఆ డబ్బు చెల్లించడానికి ఎవరు ముందుకు వస్తారు.. అన్నాడిఎంకె.. డీఎంకే ద్రావిడ వాదాన్ని తలకెత్తుకున్నాయి. కానీ ఓ వర్గాలను మెప్పించడానికి హిందువులను తొక్కేశాయి. అంతేకాదు, దేవాలయ ఆస్తులను కూడా ఆక్రమించాయి. ఓ నివేదిక ప్రకారం తమిళనాడులో చాలావరకు ఆలయాలలో ఆస్తులు అన్యాక్రాంతం అయిపోయాయి. ఇందులో డీఎంకే.. అన్న డీఎంకే పార్టీ నేతల హస్తముంది ఇప్పుడు టీవీకి నేతలు కూడా అదే పని చేస్తారు. అలాంటప్పుడు ఈ దుర్మార్గుల భరతాన్ని ఎవరు బయటపెడతారు.. సాక్షాత్తు ఆ దేవుడే దిగి వస్తే తప్ప ఈ ఆక్రమాలకు పాల్పడిన దుర్మార్గుల అసలు రంగు బయటపడదు.

# టాలీవుడ్ కు యదేచ్ఛగా డ్రగ్స్...

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:** తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈగల్ ఫోర్స్ మరో కీలక ఆపరేషన్ నిర్వహించింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఒకేసారి ప్రత్యేక దాడులు చేపట్టిన అధికారులు డ్రగ్స్, గంజాయి వినియోగిస్తున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను బలహీనపరచడంతో పాటు డిమాండ్‌ను తగ్గించడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన వారిలో 14 మందికి గంజాయి వినియోగించినట్లు పరీక్షల్లో నిర్ధారణ కాగా, మరో వ్యక్తికి గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాల వినియోగం కూడా పాజిటివ్‌గా తేలింది. విచారణలో భాగంగా అందరూ డ్రగ్స్ వినియోగించిన విషయాన్ని అంగీకరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. అనంతరం వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు వెల్లడించింది. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతంలో హాస్టల్‌ను కేంద్రంగా చేసుకుని ఓ ముఠా కొకైన్, ఎండీఎంఏ, ఎల్‌ఎస్డీ, హ్యాష్ ఆయిల్ వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ గుర్తించింది. బెంగళూరు, గోవా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా జరుగుతున్నట్లు సాంకేతిక విశ్లేషణలో తేలిందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ మాదకద్రవ్యాలను సినీ పరిశ్రమకు చెందిన కొంతమందికి కూడా విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. టెక్నికల్ అనాలిసిస్ ద్వారా మొత్తం 44 మంది డ్రగ్స్ వినియోగదారులను అధికారులు గుర్తించారు. వీరిలో హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రధాన డ్రగ్ పెడ్లర్లు నగరంలో అందుబాటులో లేకపోవడంతో వినియోగదారులపై దృష్టి సారించి ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు ఈగల్ ఫోర్స్ పేర్కొంది. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంతో దాడులు నిర్వహించినట్లు తెలిపింది. విచారణలో మరో కీలక అంశం బయటపడింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డి పేర్లపై ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.3.13 లక్షలకు పైగా బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. చక్రపాణి, హర్షిత్ రెడ్డి ఇప్పటికే 2019లో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయిన నిందితులేనని పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు దర్యాప్తును మరింత విస్తరించినట్లు ఈగల్ ఫోర్స్ తెలిపింది. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ఇటువంటి ప్రత్యేక ఆపరేషన్లు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# సోలార్ ప్యానెల్స్ తో జలమండలి

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:**
జలమండలికి పెరుగుతున్న విద్యుత్ వినియోగం, అదే స్థాయిలో అందుతున్న భారీ కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడానికి సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టును మూడు దశల్లో చేపట్టాలని నిర్ణయించుకోగా, తాజాగా దీనికి కార్యాచరణ సిద్ధమైంది. మొదటి దశలో భాగంగా మల్లారం, పెద్దాపూర్, కొండపాక ప్రాంతాల్లో రూ. 383 కోట్ల వ్యయంతో భారీ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా 67.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలోనే ఈ పనుల కోసం టెండర్లు పిలవడానికి వాటర్ బోర్డు సిద్ధమైంది. నగరానికి సరఫరా చేస్తున్న నీటిలో కృష్ణా, గోదావరి నదుల నుంచి ఎత్తిపోతల ద్వారా వస్తున్న నీరే కీలకం. మంజీర జలాలు కూడా పాక్షికంగా ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి ఉండటంతో, జలమండలికి భారీగా విద్యుత్ అవసరమవుతోంది. ప్రస్తుతం జలమండలి నెలకు రూ. 120 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలను చెల్లిస్తోంది. జలమండలికి అనేక ప్రాంతాల్లో సొంత ఖాళీ స్థలాలు ఉండటమే కాకుండా, పలుచోట్ల భారీ రిజర్వాయర్లు ఉండటం వల్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఈడీసీఓ) సమన్వయంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 72 ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని జలమండలి అధికారులు గుర్తించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఎల్ నినో .. డ్రై ల్యాండ్ క్రాప్స్

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:**
ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. దీనివల్ల నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటోంది.. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలు ఆరుతడి పంటల వైపు దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. వర్షాలు తగ్గడం వల్ల కరవు పరిస్థితులు, వ్యవసాయ రంగానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉందని వివరిస్తున్నారు.. పంటల దిగుబడి భారీగా తగ్గే అవకాశం ఉంటుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, రైతులలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.. అలాగే అందుబాటులో ఉన్న వనరులతో పాటు మారుతున్న వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయం చేయలని సూచిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాలతోపాటు.. వర్షాలు, ఎక్కువగా నీటిపై ఆధారపడే వారు ఖరీఫ్ లో వర్షాధారంగా లేదా తక్కువ నీటి తడులతో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం ఎంతో అవసరం. ఆరుతడి పంటలు వల్ల నష్టాలను నివారించవచ్చని పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అనువైన ప్రధాన ఆరుతడి పంటలు:

**అపరాలు- పప్పుధాన్యాలు**

కందులు: తేమ తక్కువగా ఉండే ఎర్ర నేలలు, మెట్ట ప్రాంతాలకు ఇవి చాలా అనుకూలం.. నీటిని తక్కువగా ఉపయోగించుకోని సాగు చేసుకోవచ్చు..

పెసర -- మినుము: పెసర, మినుము 75-90 రోజుల్లో చేతికి వచ్చే పంటలు.. వీటికి నీరు కూడా తక్కువ అవసరం ఉంటుంది.

**నూనె గింజలు**

**వేరుశనగ:** వర్షాలు తక్కువగా ఉన్నా తేలికపాటి నేలల్లో బాగా పండుతుంది. వేరుశనగ (పల్లి) పంటకు సాధారణంగా నీరు ఎక్కువగా అవసరం లేదు.

సోయాబీన్: నల్లరేగడి నేలలు, తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాగు చేయడానికి ఇది ఉత్తమమైన ఎంపిక.

**నువ్వులు:** ఖరీఫ్ ప్రారంభంలో (తొలకరి) వేసుకోవడానికి అనువైన నూనె గింజ పంట.

చిరుధాన్యాలు

జొన్న, సజ్జలు, రాగి .. నీటి వనరులు తక్కువగా ఉన్నా, వర్షాలు అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పంటలు సులువుగా పెరుగుతాయి.

మొక్కజొన్న కూడా అద్భుతమైన ఆరుతడి పంట. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లోనూ, అధిక దిగుబడిని, మంచి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటగా, ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు దీనిని

**సాగు చేసుకోవచ్చు.**

అయితే.. సాధారణంగా ఖరీఫ్ కాలంలో అధిక వర్షపాతం కారణంగా రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఎల్ నీనో ప్రభావంతో నీటి వనరులు తక్కువగా ఉండే అకాశం ఉండటంతో నీటి ఎద్దడిని

ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటలు బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు.

ఎల్ నినో సమయంలో ఆరుతడి పంటలు వేయడంతో పాటు.. బిందు సేద్యం లేదా తుంపర సేద్యం పద్ధతులను వాడితే ఉన్న కొద్దిపాటి నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చు. అలాగే నేలలో తేమ ఆరిపోకుండా మల్చింగ్ పద్ధతిని కూడా ప్రయత్నించవచ్చు.

# పెళ్లిళ్ల సీజన్ స్టార్ట్.... వేలాది కళ్యాణాలు...

**హైదరాబాద్, జూన్ 17, పెన్ పవర్:**
అధిక జ్యేష్ఠ మాసం కారణంగా నిలిచిపోయిన శుభకార్యాలకు బ్రేక్ పడింది. నిజ జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి తిథి ప్రారంభం కావడంతో, జులై 12వ తేదీ వరకు వరుసగా అత్యంత బలమైన సుముహూర్తాలు ఉన్నాయని ప్రముఖ వేద పండితులు స్పష్టం చేస్తున్నారు. ఈ సుదీర్ఘ విరామం తర్వాత వస్తున్న ముహూర్తాలు కావడంతో ప్రతీ రోజూ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ముహూర్తాల సీజన్ జూన్ నెల

రెండో సగం నుంచి ప్రారంభమై, జులై రెండో వారం వరకు నాన్-స్టాప్‌గా సాగనుంది. వేద పండితుల పంచాంగ గణనం ప్రకారం జూన్ నెలలో అత్యధికంగా ముహూర్తాలు అందుబాటులో ఉన్నాయి. జూన్ 16, 17, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో వరుసగా కల్యాణ ఘడియలు ఉన్నాయి. అలాగే జులై నెల ప్రారంభంలోనూ మంచి రోజులు కుదిరాయి. జులై 1, 6, 7, 9, 10, 11 తేదీల్లో వివాహాలు

నిశ్చయించుకోవడానికి, లగ్న పత్రికలు రాసుకోవడానికి అత్యంత అనుకూలమైన రోజులుగా పండితులు నిర్ణయించారు. కేవలం పెళ్లిళ్లే కాదు.. గృహప్రవేశాలు, శంకుస్థాపనలకూ ఇదే మంచి సమయంఈ ముహూర్తాల సీజన్ కేవలం వివాహాలకే పరిమితం కావడం లేదు. కొత్త ఇళ్లలోకి అడుగుపెట్టేందుకు చూస్తున్న వారికి నూతన గృహ ప్రవేశాలు చేయడానికి, కొత్త వ్యాపారాలు లేదా నూతన కట్టడాలకు శంకుస్థాపనలు నిర్వహించడానికి ఈ కాలం అత్యంత శ్రేష్ఠమైనదిగా భావిస్తున్నారు. అంతేకాకుండా, పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు,



ప్రతిష్ఠాత్మక ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఇదే కాలంలో భారీ ఎత్తున చేపట్టేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, మంగళకర వాతావరణం నెలకొంది. వరుస ముహూర్తాల నేపథ్యంలో మార్కెట్లలో వ్యాపారాలు ఒక్కసారిగా జోరందుకున్నాయి. పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వారు రెండు, మూడు నెలల ముందే అప్రమత్తమై కల్యాణ మండపాలను బుక్ చేసుకోవడంతో ప్రస్తుతం ఎక్కడా

చూసినా మండపాల కొరత కనిపిస్తోంది. ఇటు బంగారు ఆభరణాల దుకాణాలు, కొత్త వస్త్రాల షోరూమ్‌లు, పూజా సామాగ్రి విక్రయ కేంద్రాలు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు డిజిటల్ మీడియా

యుగంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు, ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ టీమ్‌లకు డిమాండ్ భారీగా పెరిగింది. పెళ్లి వాయిద్యాల కళాకారులు, క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని దొరకడంతో ఈ

సీజన్ అందరి జీవితాల్లోనూ ఆర్థికంగా కొత్త వెలుగులు నింపుతోంది. దాదాపు నెల రోజుల పాటు సాగనున్న ఈ మంగళకర సీజన్ స్థానిక ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊపునిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మహారాష్ట్రలో ఆపరేషన్ టైగర్..

**న్యూఢిల్లీ, జూన్ 17, పెన్ పవర్:**
ప్రాంతీయ పార్టీల దూకుడుకు మరింతగా బ్రేకులు వేయాలని భావిస్తున్నారా? అంటే .. తాజాగా జరుగుతున్న పరిణామాలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఇటీవల ఎన్నికలు జరిగిన.. ఐదు రాష్ట్రాల్లో కీలకమైన తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో ప్రభుత్వ పార్టీలు ఓడిపోయాయి. ఈ క్రమంలో బెంగాల్‌లో బీజేపీ సర్కారు ఏర్పడింది. దీంతో బెంగాల్‌లో 80 స్థానాలు దక్కించుకున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నందిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. దీని వెనుక బీజేపీ మంత్రాంగం ఉందన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇక, తమిళనాడులోనూ ఇదే తరహా వ్యూహాత్మక సన్నివేశాలు ఖాయమని అంచనా వేస్తున్న డీఎంకే .. జాగ్రత్తలు తీసుకుంటోంది. ఉన్న 57 మంది ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకుంటోంది. ఇలా.. పలు రాష్ట్రాల్లో బీజేపీ దెబ్బకు ప్రాంతీయ పార్టీలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయని..

జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది. మరోవైపు.. మహారాష్ట్రలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ పట్టు మరింత బిగించే ప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికలకు ముందు..బలైమన శివసేన పార్టీని చీల్చిన విషయం తెలిసిందే. ఈ పార్టీ కీలక నాయకుడిగా ఉన్న ఏక్‌నాథ్ షిండేతో తిరుగుబాటు జెండా ఎగరేయించి.. శివసేనను ముక్కలు చేశారు. ఆ తర్వాత.. బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇక, వచ్చే ఎన్నికలకు సంబంధించి.. ఇప్పటి నుంచే ఆపరేషన్ టైగర్ పేరుతో శివసేనను మరింత వీక్ చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది. చీలిపోయిన శివసేనకు సంబంధించి ఉద్ధవ్ థాక్రే నివాసంలో శివసేన నేతల భేటీ ఆదివారం జరిగింది. అయితే.. ఈ సమావేశానికి ముగ్గురు ఎంపీలు దూరంగా ఉండడం.. వారు బీజేపీ వైపు దృష్టి పెట్టడం వంటివి చర్చకు దారితీశాయి. బెంగాల్ మాదిరిఆపరేషన్ టైగర్ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. అయితే.. శివసేన మాత్రం తమ నేతలందరూ తమతోనే ఉన్నారని ప్రకటించింది. కానీ, చిత్రంగా.. ఈ సమావేశానికి రాని ఎంపీలు... బీజేపీ నేత ఇంట్లో విందుకు హాజరు కావడం గమనార్హం. మరోవైపు.. ఇప్పటికే కోరలు ఊడిపోయి.. ఇబ్బందిలో ఉన్న శివసేన మాత్రం గాండ్రింపులు మానలేదు. మేం అధికారంలోకి వస్తే బీజేపీ ఉనికిలో ఉండదు. బీజేపీ నేతలు ఇళ్ల నుంచి కూడా బయటకు రాలేరు. అని ఆ పార్టీ నాయకుడు సంజయ్‌రౌత్ వ్యాఖ్యానించారు.

# భోగాపురం ఎయిర్ పోర్టుకు బస్సులు

**శ్రీకాకుళం, జూన్ 17, పెన్ పవర్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరి కొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. జూలై నుంచి అధికారికంగా విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. అయితే విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు చాలా రహదారులు ఉన్నాయి. 52 కిలోమీటర్ల దూరం కాగా.. ట్రాఫిక్ ఇబ్బందులతో దాదాపు రెండు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఈ ఇబ్బందులను అధిగమించి నేరుగా విశాఖ నగరం నుంచి ఎయిర్పోర్ట్ కు రహదారులను మెరుగుపరిచేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే విశాఖ నుంచి భోగాపురం వెళ్లడానికి విమాన ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం పై.. ఆంధ్రప్రదేశ్ విమాన ప్రయాణికుల సంఘం జీఎంఆర్ సంస్థకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. విమాన ప్రయాణికులు తమ సొంత కార్లపై భోగాపురం వెళితే ట్రాఫిక్ మరింత ఇబ్బందికరంగా మారుతుందని.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేసింది.విశాఖ నుంచి వచ్చే విమాన ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జీఎంఆర్ సంస్థ సరికొత్త ఆలోచన చేసింది. విశాఖ నగరంలో 9 చోట్ల వెయిటింగ్ లాంజ్ లు ఏర్పాటు చేయనుంది. దేశంలోనే తొలిసారి ఇటువంటి ఏర్పాట్లు చేయడం. తొలి విడతలో ఐదు లాంజ్ లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నంలో ఉంది. ఇందుకోసం జీఎంఆర్ గ్రూపు ముంబైలో ప్రత్యేకంగా కంటైనర్లను తయారుచేస్తోంది. 40 అడుగుల వెడల్పు, పది అడుగుల పొడవు కలిగిన కంటైనర్లు లాంజ్ రూపంలో అందుబాటులోకి రానున్నాయి. భోగాపురం వెళ్లాల్సిన విమాన ప్రయాణికులు వారికి సమీపంలో ఉన్న కంటైనర్ల వద్దకు చేరుకుంటే.. అక్కడి నుంచి ఆర్టీసీ నడిపే ఎలక్ట్రిక్ బస్సుల్లో భోగాపురం ఎయిర్పోర్ట్ వెళ్ళవచ్చు. దీనివల్ల విమానాశ్రయ మార్గంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. తక్కువ చార్జీలతో విమానాశ్రయానికి చేరుకోవచ్చు. భారతదేశంలోనే తొలిసారిగా విమాన ప్రయాణికుల కోసం కంటైనర్ లాంజ్ అందుబాటులోకి వస్తుండడం విశేషం.విశాఖ మహా నగరానికి ప్రభుత్వం 50 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించింది. వాటిలో తొలి విడత 20 బస్సులు నాలుగు రోజుల్లో విశాఖకు రానున్నాయి. మరోవైపు చార్జింగ్ స్టేషన్ల నిర్మాణం కూడా చురుగ్గా సాగుతోంది. బస్సులు రాగానే ట్రైల్ రన్ కూడా నిర్వహిస్తారు. వీటిలో పది బస్సులు గాజువాక నుంచి జాతీయ రహదారిలో ఆనందపురం మీదుగా భోగాపురం వరకు తిరుగుతాయి. మరో 10 బస్సులు గాజువాకలో బయలుదేరి నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల మీదుగా భోగాపురం విమానాశ్రయానికి వెళ్తాయి. ట్రయల్ రన్ లో భాగంగా చెక్ ఇన్ కౌంటర్లు, లగేజీ స్కానింగ్ వంటి వాటికి సంబంధించి ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మరోవైపు జూలై 5న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం రావాల్సి ఉంది.

**అప్పుడే రద్దీ**

విజయనగరం జిల్లాలో నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. నెలల కిందట ప్రధాన పనులు జరగడంతో రాయల్ రన్ కూడా జరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన తొలి ఎయిర్ ఇండియా వాలిడేషన్ ఫ్లైట్ భోగాపురం విమానాశ్రయం రన్ వే పై దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారీ విమానాలు కూడా ల్యాండ్ అయ్యేలా భోగాపురం ఎయిర్పోర్ట్ రన్ వేను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ ట్రయల్ రన్ విజయంతో
రన్ వే సామర్థ్యం, భద్రత ప్రమాణాలపై అధికారులకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. దాదాపు పెండింగ్ పనులన్నీ తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోందిరాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించారు. ఈ ఎయిర్పోర్ట్ అందుబాటులోకి వస్తే విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు మాత్రమే కాకుండా ఒడిస్సా సరిహద్దు ప్రాంతాలకు కూడా ఇది ప్రధాన విమాన కేంద్రంగా మారనుంది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు విశాఖపట్నం ఉన్న విమాన ప్రయాణ భారం తగ్గడంతో పాటు.. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం తో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన విమాన సేవలు లభించనున్నాయి. ప్రస్తుతం ఎయిర్పోర్ట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో సందర్శకులతో కిటకిటలాడుతోంది. విశాఖకు వచ్చే పర్యాటకులు సైతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రద్దీగా మారడం విశేషం.

# మళ్లీ యాక్టివ్ కానున్న భార్గవ్ రెడ్డి

**విజయవాడ, జూన్ 17, పెన్ పవర్:** అధికారం పోయాక అగ్రెసివ్నెస్ పోయింది.. టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ పెట్టడం మరచిపోయి అకౌంట్నే పోగొట్టుకున్నారా? వైసీపీ సోషల్ మీడియాకు పట్టిన 'హ్యాకింగ్' గ్రహణాన్ని వీడించాలంటే.. మళ్లీ ఆ 'భార్గవ' రాముడే రావాలా? ఇప్పుడు నెట్టింట ఇదే చర్చ నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగంలో ఇటీవల జరిగిన ఒక పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వైసీపీ అధికారిక ఫేస్బుక్ అకౌంట్ హ్యాక్కు గురికావడం.. అందులో హ్యాకర్లు అసభ్యకరమైన కంటెంట్ను పోస్ట్ చేయడంతో మెటా యాజమాన్యం ఆ పేజీని బ్లాక్ చేసింది. ఈ ఘటన పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేయడమే కాకుండా వైసీపీ సోషల్ మీడియా విభాగ నిర్వహణలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రస్తుతం నెటిజన్లు, పార్టీ మద్దతుదారుల మధ్య ఒకే ఒక చర్చ నడుస్తోంది.. "వైసీపీ సోషల్ మీడియా మళ్లీ పూర్వవైభవం సాధించాలంటే సజ్జల భార్గవ్ రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపట్టాల్సిందేనా? అన్న చర్చ సాగుతోంది. సాధారణంగా ఒక ప్రధాన రాజకీయ పార్టీకి సంబంధించిన అధికారిక సోషల్ మీడియా ఖాతాలకు అత్యున్నత స్థాయి భద్రత ఉండాలి. కానీ తాజా హ్యాకింగ్ ఘటన చూస్తుంటే అడ్మిన్లు కనీస జాగ్రత్తలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైబర్ నిపుణుల అభిప్రాయం ప్రకారం అడ్మిన్లలో ఎవరో ఒకరు అనుమానాస్పద లింక్లను క్లిక్ చేయడం... సిస్టమ్ లేదా అకౌంట్ పాస్వర్డ్లను చాలా సాదాసీదాగా ఉంచడం... టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వంటి ప్రాథమిక భద్రతా ప్రమాణాలను ఎనేబుల్ చేయకపోవడం.. ఇలాంటి సాంకేతిక నిర్లక్ష్యం వల్లే లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న అధికారిక పేజీ హ్యాకర్ల చేతుల్లోకి వెళ్ళిపోయిందని.. ఇది పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆ తర్వాత మందగమనం వైసీపీ 2014 నుండి 2019 వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దాని సోషల్ మీడియా వింగ్ అత్యంత 'ఆర్గానిక్'గా పకడ్బందీగా పనిచేసింది. అప్పట్లో ప్రత్యర్థులపై డిజిటల్ వేదికలపై వైసీపీ సాధించిన పైచేయి పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ సోషల్ మీడియాలో ఆ పాత దూకుడు కనిపించలేదు. ప్రభుత్వంలో బిజీ అయిపోవడం వల్లో..లేదా సరైన లీడర్షిప్ లేకపోవడం వల్లో కానీ డిజిటల్ వేదికలపై పార్టీ పట్టు సడలిందనేది వాస్తవం.అగ్రెసివ్ పాలిటిక్స్ ఈ క్రమంలోనే సజ్జల భార్గవ్ రెడ్డి వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఎంట్రీతో సీన్ పూర్తిగా మారిపోయింది. భార్గవ్ రెడ్డి తన టీమ్తో కలిసి సోషల్ మీడియాను అత్యంత వ్యూహాత్మకంగా, అగ్రెసివ్గా మార్చారు. కార్యకర్తల అభిప్రాయం ప్రకారం .. "భార్గవ్ రెడ్డి ఉన్నప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలో సోషల్ మీడియా సైన్యం క్షణం కూడా ఆలస్యం చేయలేదు. టెక్నికల్ సెక్యూరిటీతో పాటు పొలిటికల్ కౌంటర్లలోనూ ఆయన టీమ్ పర్ఫెక్ట్ సిస్టమాటిక్ అప్రోచ్ను ఫాలో అయ్యింది. అయితే ఇటీవల ప్రభుత్వం దిగిపోయిన తర్వాత భార్గవ్ రెడ్డి, ఆయన కోర్ టీమ్ వైసీపీ సోషల్ మీడియా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వారు పక్కకు తప్పుకున్న కొద్ది రోజులకే ఇలాంటి భారీ భద్రతా లోపం జరగడం.. ఏకంగా ఫేస్బుక్ పేజీనే కోల్పోవాల్సి రావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికల్లో వైసీపీ అభిమానులు, కార్యకర్తలు ఒకే విషయాన్ని డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ భార్గవ్ రెడ్డినే రంగంలోకి దించాలని కోరుతున్నారు. ఆయన వస్తేనే సోషల్ మీడియా మళ్లీ గాడిలో పడుతుందని.. ప్రత్యర్థులకు గట్టి కౌంటర్లు ఇవ్వడం సాధ్యమవుతుందని గట్టిగా నమ్ముతున్నారు. వ్యక్తుల మార్పు కంటే సోషల్ మీడియా నిర్వహణకు బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు అవసరమని నిపుణులు చెబుతున్నప్పటికీ రాజకీయాల్లో వ్యూహాలు ప్రతివ్యూహాలు నడపడానికి సమర్థుడైన లీడర్ అవసరం. మరి ఈ సంక్షోభం నేపథ్యంలో వైసీపీ అధిష్టానం సోషల్ మీడియా బాధ్యతలను మళ్లీ భార్గవ్ ?డికి అప్పగిస్తుందా? లేక కొత్త వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అనేది వేచి చూడాలి.

# అనిత వర్సెస్ అమర్నాథ్...

**విశాఖపట్టణం, జూన్ 17, పెన్ పవర్:** టీడీపీ మంత్రి... అండ్ వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా సమన్వయకర్త. ఈ ఇద్దరు నేతల కేరాఫ్ అడ్రస్ అనకాపల్లి జిల్లానే. రాజకీయంగా టామ్ అండ్ జెర్రీ ఫైటింగే. రెండు పార్టీలకు చెందిన మిగిలిన నేతలు కాస్త అటో ఇటో సంయమనం పాటించినా.. ఈ ఇద్దరిది మాత్రం ఛాన్స్ దొరికితే రప్పా.. రప్పానే..! తాము ప్రతిపక్ష నేతగా.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పదునైన వ్యాఖ్యలతో విరుచుకుపడే వారు అనిత. ఆమెకు కౌంటర్ ఇవ్వడానికి అమర్నాథ్ ఘాటుగానే స్పందించే వారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏకైక మంత్రి అయ్యారు అనిత. అందులోనూ... హోం లాంటి పవర్ ఫుల్ శాఖకు మంత్రి కావడంతో ఆమె మీద అటెన్షన్ పెరిగింది. టీడీపీ అధిష్టానానికి దగ్గరగా ఉండటం, కీలక కమిటీల్లో సభ్యురాలు అవడం వంటి కారణాలతో అనిత ప్రాధాన్యత బాగా పెరిగిందన్నది విస్తృతాభిప్రాయం. అదే సమయంలో హోం మంత్రి రాజకీయంగా చేసే విమర్శలు ఇటీవల ఘాటెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి చేసే వ్యాఖ్యలపై ఆ పార్టీ నేతలు మండి పడుతూ ఉంటారు. ఈ క్రమంలో అనిత దూకుడుకు బ్రేకులు వేయాల్సిందేనని డిసైడ్ అయ్యారట వైసీపీ లీడర్స్. తమ అధినేత, ఆయన కుటుంబ సభ్యుల పట్ల హోం మంత్రి వాడే భాష సరిగా లేదంటూ ఆమెకు.. ఆ భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరిస్తుంటారు ప్రతిపక్ష నాయకులు చాలామంది.అయితే... ఆ విషయంలో అందరికంటే ముందుగా కుండబద్దలు కొట్టేశారు మాజీ మంత్రి అమర్నాథ్. వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో చోడవరంలో భారీ బైక్ ర్యాలీ చేశారు అమర్నాథ్. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ కాక రేపాయి. జిల్లాలో ఒక మేకప్ మంత్రి ఉన్నారంటూ మొదలుపెట్టి.. మాజీ మినిస్టర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. మా మేడంను అంత మాట అంటారా అంటూ పాయకరావుపేట టీడీపీ నాయకులు ముందు గళం విప్పారు. ఆ తర్వాత తెలుగు మహిళలు తెరపైకి వచ్చి తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేశారు. కోడిగుడ్లతో అమర్నాథ్ ఫ్లెక్సీ మీద కొట్టి దిష్టి బొమ్మ దగ్ధం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ... అదంతా దిగువ స్థాయిలోనే. కానీ.. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఏకైక మంత్రిని ఉద్దేశించి మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యేలు పెద్దగా ఎందుకు రియాక్ట్ అవలేదన్నది బిగ్ క్వశ్చన్. విశాఖ జిల్లాలో టీడీపీ పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. అయినా ఎమ్మెల్యేల స్థాయిలో రియాక్షన్స్ లేకపోవడానికి కారణాలను వెదుకుతున్నాయి రాజకీయ వర్గాలు. అమర్నాథ్ చోడవరంలో అలాంటి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు కాబట్టి... మీ అభిప్రాయం ఏంటని మీడియా అడిగితే స్థానిక ఎమ్మెల్యే రాజు స్పందించారు. రాజకీయాల్లో భాష హుందాగా ఉండాలని, అమర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ముక్తసరిగా చెప్పి





వదిలేశారు.ఇక మూడు రోజుల తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పందించారు. అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతకు మించి మిగతా కూటమి ఎమ్మెల్యేలు ఎవ్వరూ కిక్కురుమనలేదు. మాట్లాడిన ఇద్దరూ కూడా ఏదో తప్పదన్నట్టు స్పందించారన్న అభిప్రాయం ఉంది. మామూలుగా అయితే.. రాష్ట్ర హోం మంత్రి, అందునా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిని ఉద్దేశించి ఆ స్థాయిలో మాజీ మంత్రి వ్యాఖ్యలు చేసినప్పుడు ఎదురు దాడి నెక్స్ట్ లెవల్లో ఉండాలి. పార్టీ నాయకత్వం మొత్తం మూకుమ్మడిగా విరుచుకుపడితోందా అనే భావన ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి బలంగా వెళ్ళాలి. కానీ ఇక్కడ అలాంటివేం జరక్కపోగా.. తప్పదన్నట్టుగా ఇద్దరు స్పందించారు. మిగతా వాళ్ళంతా మాకేం సంబంధం అన్నట్టుగా ఎందుకు ఉన్నారంటూ ఆరా తీస్తున్నారు పొలిటికల్ పరిశీలకులు. కూటమిగా కాకపోయినా కనీసం టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలుగా అయినా మాజీ మంత్రికి గట్టి కౌంటర్ ఇవ్వవచ్చుగానీ.. ఆ పని కూడా చేయలేకపోవడానికి ప్రత్యేక కారణాలు ఏవైనా ఉన్నాయా అంటూ ఎంక్వైరీ చేస్తున్నారు. ఈ పరిస్థితికి మంత్రి, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణం అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది. అనితతో పోలిస్తే ఇక్కడ కూటమిలో ఉన్న ఎమ్మెల్యేలంతా రాజకీయంగా సీనియర్లు. అలాంటి చాలా మందికి అవకాశాలు ఆలస్యంగా వస్తే.. అనిత దశాబ్ద కాలంలోనే రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఛాన్స్ దక్కించుకున్నారు.కేబినెట్తో పాటు హైకమాండ్ దగ్గర లభిస్తున్న ప్రయారిటీ కారణంగా ఆమె జిల్లా ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకునే విషయంలో కాస్త అలసత్వం ప్రదర్శించారని, ఇంకా చెప్పాలంటే నాకేంటి అన్నట్టు వ్యవహరిస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. విశాఖ సిటీ శాసనసభ్యులు అయితే స్థానిక వ్యవహారాల్లో మంత్రిగా అనిత జోక్యాన్ని అస్సలు అంగీకరించడం లేదన్న గుసగుసలు ఉన్నాయి. అందుకే శాఖాపరమైన అంశాల మీద తప్ప విశాఖ నగరానికి సంబంధించిన వ్యవహారాల్లో ఆమె ప్రమేయం బాగా తగ్గిందని అంటున్నారు.
ఇక్కడ తగ్గింది అనడం కంటే తగ్గించారనడమే కరెక్ట్ అన్నది చాలామంది ఫీలింగ్. ఇక అనకాపల్లి జిల్లా ఎమ్మెల్యేలతోనూ దాదాపు ఇదే వ్యవహార శైలి ఉందట. జిల్లాకు సంబంధించిన అంశాల మీద ఎమ్మెల్యేలతో సమావేశాలు పెట్టడంగానీ, వాళ్ళ అభిప్రాయాలు తీసుకుని అందుకు అనుగుణంగా నిర్ణయాలు అమలు చేయడం కానీ లేదట. అన్నింటికి కేరాఫ్ హైకమాండ్ అంటున్నారని.. అలాంటప్పుడు ఆమెను ఎవరో ఏదో అంటే.. మేం రాజకీయ ఎదురుదాడికి ఎందుకు వెళ్ళాలని ఓ సీనియర్ నేత అన్నారట. దీంతో.. ఉమ్మడి విశాఖ జిల్లాలో హోం మంత్రి ఒంటరి అయ్యారా అన్న సందేహాలు వస్తున్నాయట పరిశీలకులకు. ఈ ఎపిసోడ్ తర్వాత అది క్లియర్గా కనిపిస్తోందన్నది వాళ్ళ ఒపీనియన్.

# రంగంలోకి మోపిదేవి వారసుడు...

**గుంటూరు, జూన్ 17, పెన్ పవర్:** ఉమ్మడి గుంటూరు జిల్లా లోని రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ఆసక్తికరంగా ఉండే ప్రాంతంగా గుర్తింపు పొందింది. రాజకీయ చైతన్యం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు తరచూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతుంటాయి. ప్రస్తుతం ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలమైన స్థితిలో ఉండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ పుంజుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.రేపల్లెలో గత మూడు ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన అనగాని సత్యప్రసాద్ తన ప్రభావాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా కూడా ఆయనకు గణనీయమైన ప్రజాభిమానం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో 2029 ఎన్నికల్లో ఆయనకు గట్టి పోటీ ఇవ్వాలంటే ప్రత్యేక వ్యూహం అవసరమని వైసీపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున మోపిదేవి వెంకటరమణ ఇక్కడ విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. అనంతరం ఆయన వైసీపీలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఎన్నికల్లో ఓడినా ఎమ్మెల్సీ, మంత్రి, తరువాత రాజ్యసభ సభ్యునిగా అవకాశాలు పొందారు. అయితే ఇటీవల ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడంతో రేపల్లె రాజకీయ సమీకరణాలు మారిపోయాయి.ఇదిలా ఉంటే, వైసీపీ కొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. రేపల్లెలో గౌడ , కాపు సామాజిక వర్గాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ రెండు వర్గాల మద్దతు సాధించిన అభ్యర్థికి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని అంచనా. అందుకే పార్టీ సామాజిక సమీకరణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.ఈ క్రమంలో మోపిదేవి శ్రీనివాస్ ను పార్టీలో చేర్చుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనకు భవిష్యత్తులో కీలక బాధ్యతలు లేదా టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న పీట నాగ మోహన్ కృష్ణ కూడా పార్టీ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు.అయితే ఈ ఇద్దరు నాయకులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు, ప్రస్తుతం వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. దీంతో పార్టీ శ్రేణుల్లో కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది. ఒక వర్గం మోపిదేవి శ్రీనివాస్కు మద్దతు ఇస్తుండగా, మరో వర్గం పీట నాగ మోహన్ కృష్ణ నాయకత్వాన్నే బలపరుస్తోంది.ఈ పరిస్థితుల్లో రేపల్లెలో వైసీపీ అంతర్గత సమన్వయం కీలకంగా మారింది. పార్టీ నాయకత్వం ఈ విభేదాలను పరిష్కరించి అందరినీ ఒకే తాటిపైకి తీసుకురాగలిగితేనే వచ్చే ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వగలదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. లేదంటే ఇప్పటికే బలంగా ఉన్న అనగాని సత్యప్రసాద్కు మరోసారి అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పవన్ నార్త్ పై గురి

**విజయవాడ, జూన్ 17, పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లో జాతీయ భావాలు ఎక్కువ. ఆయన ప్రాంతీయవాదానికంటే జాతీయ సమైక్యతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. ఆ భావనతోనే నిన్న ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి స్పష్టమైన సంకేతాలు పంపారు. తన రాజకీయ పరిధిని మరింత విస్తృతం చేసుకోవాలన్న ఆలోచన పవన్ లో కనిపించింది. కేవలం ప్రాంతీయ రాజకీయాలకే పరిమితం కాకుండా... ఢిల్లీ వేదికగా జాతీయ రాజకీయాల్లో ఒక స్పష్టమైన, కీలకమైన పాత్ర పోషించాలనే సంకల్పం పవన్ కళ్యాణ్ లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా పవన్ నోటి నుంచి పదేపదే జాతీయవాదం రావడం వెనుక పక్కా వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోందిపవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం చూస్తే ఆయన ఆరాటం అధికారం కోసం కాదు. నిర్దిష్టమైన సిద్ధాంతాలతో పాటు దేశభక్తి పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. భారతీయత అనే ఉమ్మడి సూత్రం, బలమైన జాతీయవాద భావజాలం ఆయనలో కనిపిస్తుంది. ఢిల్లీ సమావేశంలో ఆయన ప్రసంగించిన తీరు, ఎంచుకున్న అంశాలు తీసుకుంటే ఒక ప్రాంతీయ పార్టీ నేతగా కాకుండా... దేశ విశాల ప్రయోజనాల దృక్పథం ఉంది. అయితే జనసేన తాజా సంకేతాలు చూస్తే మాత్రం పవన్ కళ్యాణ్ అడుగులు జాతీయస్థాయి వైపు వేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.ఎన్డీఏ లో కీలక భాగస్వామిగా ఉన్నారు పవన్ కళ్యాణ్. ఏపీలో సైతం బిజెపి తెలుగుదేశం పార్టీతో జత కట్టడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం పవన్ కళ్యాణ్. అందుకే మోడీతో పాటు అమిత్ షా పవన్ కళ్యాణ్ విషయంలో ప్రత్యేక గౌరవంతో ఉంటారు. అందుకే త్వరలో నరేంద్ర మోడీ పవన్ కళ్యాణ్ కు దేశవ్యాప్తంగా ఒక బాధ్యత కట్టబెడతారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. దేశవ్యాప్తంగా సనాతన ధర్మ రక్షణ, సామాజిక సమతుల్యం, యువతను దేశ నిర్మాణం వైపు మళ్లించడం వంటి అజెండాలతో.. జనసేన ను జాతీయస్థాయిలో బలోపేతం చేయాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించాలనుకునేవారు చాలా తక్కువ. ఒకవేళ వారు వెళ్లిన ప్రాంతీయ ప్రయోజనాల కోణంలోనే చూస్తుంటారు తప్ప.. సమైక్య భావనతో కాదు. ఆ శూన్యతను భర్తీ చేయాలనుకుంటున్నారు పవన్ కళ్యాణ్. హిందీ తో పాటు ఇంగ్లీష్ లో ఉన్న పట్టు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయనకున్న క్రేజ్, సనాతన ధర్మంపై ఆయనకు ఉన్న స్పష్టమైన స్టాండ్, జాతీయస్థాయిలో ఉన్న పలుకుబడి, ఏపీ ప్రజల మద్దతు వెరసి.. దేశ రాజకీయాలను ప్రభావితం చేయగల సామర్థ్యం పవన్ కళ్యాణ్ సొంతం. పవన్ కళ్యాణ్ కేవలం ఏపీ డిప్యూటీ సీఎం పదవితో ఆగిపోకుండా.. దేశ రాజకీయ గమనంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధం కావడం జనసైనికుల్లో జోష్ నింపుతోంది. ఢిల్లీ పెద్దలతో ఆయనకు వ్యూహాత్మక సంబంధాలు జాతీయ నాయకుడిగా తీర్చిదిద్దుతాయని జనసైనికులు బలంగా భావిస్తున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో...

# 19న కూటమి సక్సెస్ రీ సౌండ్

**విశాఖపట్టణం, జూన్ 17, పెన్ పవర్:** ఏపీలో టీడీపీ కూటమి రెండేళ్ళ పాలన పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి సభను రాయలసీమ రీజియన్ లో నిర్వహించారు. అది బ్రహ్మాండమైన తీరులో సక్సెస్ అయింది అని కూటమి నేతలు అంతా ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో రెండవ సభకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ వారాంతంలో విశాఖలో పెద్ద ఎత్తున సభను నిర్వహించి ఉత్తరాంధ్రాలో కూటమి సక్సెస్ మీద రీసౌండ్ చేయాలని భావిస్తున్నారు.ఈసారి విశాఖలో నిర్వహించే సభకు కేంద్ర మంత్రులు పలువురు హాజరవుతారని అంటున్నారు. అలాగే ఏపీలోని కీలక మంత్రులు అంతా ఈ సభకు వస్తారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్ తో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్ రామ్మోహన్ నాయుడు సహా అంతా ప్రసంగించబోతున్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పాలనకు 12 ఏళ్ళు పూర్తి కావడంతో ఆ సంబరాలను అలాగే ఏపీలో కూటమి రెండేళ్ళ విజయోత్సవాలను కలిపి నిర్వహిస్తామని చెబుతున్నారు ఈ నెల 19న విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో నిర్వహించే ఈ సభకు ఏర్పాట్లు జోరుగా చేస్తున్నారు. వేలాదిగా ప్రజానీకం ఈ సభకు హాజరవుతుందని అంచనా వేస్తున్నారు. ఉత్తరాంధ్రాలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా కూటమి నేతలు తెలియ చేస్తారని అంటున్నారు. రెండేళ్ళలో పెద్ద ఎత్తున పరిశ్రమలు విశాఖ సహా మూడు జిల్లాలకు వచ్చిన సంగతిని కూడా గుర్తు చేస్తున్నారు. కూటమికి ఉత్తరాంధ్రాలో ఇప్పటికే రాజకీయంగా మంచి పట్టు ఉంది. దానిని మరింతగా బిగించేందుకు ఈ విజయోత్సవ సభను ఉపయోగించుకుంటారని అంటున్నారు. రానున్న కాలంలో స్థానిక సంస్థలు జరగనున్నాయి. దాంతో ఆ ఎన్నికల కోసం కూడా ఈ తరహా సభని వినియోగించుకోవాలన్న ప్రణాళికతో కూటమి పెద్దలు ముందుకు సాగుతున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో ఏకపక్షంగా ఉత్తరాంధ్ర కూటమికి జై కొట్టింది. ఏజెన్సీలో రెండు సీట్లు తప్ప మొత్తం అన్నీ కూటమి పార్టీలే గెలుచుకున్నాయి. ఇపుడు తాము అభివృద్ధి చేసి చూపిస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే ఈ నెల 19న జరిగే సభ అదిరిపోయే లెవెల్ లో ఉంటుందని కూటమి నాయకులు చెబుతున్నారు. తిరుపతి సభను మించేలా జరపాలని చూస్తున్న కూటమి నేతల ప్రయత్నాలు ఒక ఎత్తు అయితే విశాఖ సభ చేసే రీ సౌండ్ పొలిటికల్ గా ఏపీలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది అన్నది చర్చగా ఉంది. చూడాలి మరి ఈ సభలో చంద్రబాబు పవన్ లోకేష్ ఇచ్చే స్పీచ్ ల వేడి వాడి ఎలా ఉండబోతోందో.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రాఘవ లారెన్స్, డిప్యూటీ సీఎం ఫొటో వెనుక అసలు నిజమిదేనా? నెట్టింట హాట్ టాపిక్




తమిళనాడు రాజకీయాలకు, సినిమా రంగానికి విడదీయరాని బంధం ఉందనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అక్కడి రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి. దళపతి సాధించిన విజయంతో సినీ రంగానికి చెందిన చాలా మంది ప్రముఖుల పొలిటికల్ ఎంట్రీపై సంకేతాలిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ త్వరలోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సీఎం విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీ ద్వారా ఆయన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల బరిలోకి దిగబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి సమయంలో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన ఒక ఫొటో తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. అంతేకాకుండా రాఘవ లారెన్స్‌ను టార్గెట్ చేస్తూ నెటిజన్లు దారుణంగా ట్రోల్ చేయడానికి కారణమైంది.

**'డిప్యూటీ సీఎం' నేమ్‌ప్లేట్‌తో ఏఐ ఫొటో**

ఇన్ స్టాలో raghavalawrenceoffl అనే అకౌంటులో రాఘవ లారెన్స్, డిప్యూటీ చీఫ్ మినిస్టర్, తమిళనాడు అన్న బోర్డుతో ముఖ్యమంత్రి విజయ్ డ్రెస్సింగును పోలినట్లు లారెన్స్ ఫొటోను పోస్టు చేశారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రూపొందించిన ఒక ఫొటో అయినప్పటికీ తమిళనాడు ఉపముఖ్యమంత్రి అని రాసి ఉన్న నేమ్‌ప్లేట్ ఉండటం తీవ్ర ఆసక్తికరంగా మారింది. సీఎం విజయ్ తనకు త్వరలో డిప్యూటీ సీఎం ఇవ్వబోతున్నారని లారెన్స్ పరోక్షంగా వెల్లడించినట్లు ఆ పోస్టు ద్వారా తెలుస్తోంది. లారెన్స్ పేరుతోనే ఉన్న ఆ పేజీ నిజంగా ఆయన అధికారిక అకౌంటా? కాదా? అన్న విషయం స్పష్టంగా తెలియడం లేదు. కానీ లారెన్స్ ఫొటో, ఉప ముఖ్యమంత్రి అన్న బోర్డు చూసిన నెటిజన్లు ఆ ఫొటోను తెగ వైరల్ చేస్తున్నారు. ఇదే సమయంలో ఆలూ లేదు.. చూలు లేదు అప్పుడే ఉప ముఖ్యమంత్రి అంటూ లారెన్స్ ను ట్రోల్ చేస్తున్నారు.

లారెన్స్ ఇప్పటివరకు ఏ పార్టీలోనూ చేరలేదు. కనీసం ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయలేదు. కానీ నేరుగా 'ఉపముఖ్యమంత్రి' పదవిని ఊహించుకుంటూ ఫొటో పెట్టుకున్నారంటూ నెటిజన్లు రకరకాల కామెంట్లతో ఆయన్ను ఆటాడుకోవడం ప్రారంభించారు. ఇంకా పార్టీలోనే చేరలేదు.. అప్పుడే డిప్యూటీ సీఎం కుర్చీ కావాలా? అని కొందరు, అతి ఆశకు ఒక హద్దుండాలి, కనీసం వార్డు మెంబర్‌గా గెలిచి చూపించండి అని మరికొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు. సీఎం విజయ్ అభిమానులు సైతం ఈ పోస్టుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. ఇలాంటి ముందస్తు అత్యుత్సాహం వల్ల పార్టీకి నెగెటివిటీ వస్తుందని మండిపడ్డారు.


**ట్విస్ట్ ఇచ్చిన అభిమాని**

అయితే, ఈ హడావుడి ట్రోలింగ్ అంతా సాగుతున్న తరుణంలోనే ఈ స్టోరీలో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. వైరల్ అవుతున్న ఈ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ లింకును పరిశీలించిన నెటిజన్లు లారెన్స్ మద్దతుదారులు అసలు నిజాన్ని బయటపెట్టారు. ఆ పోస్ట్ షేర్ చేయబడిన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ రాఘవ లారెన్స్‌కు చెందిన ఒరిజినల్ ఐడీ కాదని, అది ఒక ఫేక్ అకౌంట్ అని కామెంట్ల రూపంలో స్పష్టం చేశారు. లారెన్స్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఐడీ వేరే ఉందని, ఆయనకు ఈ పోస్ట్‌తో ఎలాంటి సంబంధం లేదని వారు తేల్చి చెప్పారు. ఎవరో ఆకతాయిలు లేదా లారెన్స్ రాజకీయ ఎదుగుదలను ఇష్టపడని వారు కావాలనే ఆయన పేరుతో ఉన్న ఫేక్ ఐడీని ఉపయోగించి, ఈ ఏఐ ఫొటోను సృష్టించి వివాదానికి తెరలేపారని వ్యాఖ్యానిస్తున్నారు.

**సినీ, రాజకీయ వర్గాల్లో చర్చ**

ఇది ఫేక్ అకౌంట్ నుండి వచ్చిన పోస్ట్ అని తేలినప్పటికీ.. సినీ, రాజకీయ వర్గాల్లో దీనిపై చర్చ మాత్రం విస్తృతంగా సాగుతోంది. రాఘవ లారెన్స్ త్వరలో రాజకీయాల్లోకి రాబోతున్నారనే ప్రచారం గట్టిగా సాగుతున్న తరుణంలోనే ఇలాంటి పోస్ట్‌లు రావడం వెనుక ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా? లేదా కేవలం లారెన్స్‌ను ట్రోల్ చేయడానికి, ఆయన ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి ప్రత్యర్థులు ఆడిన డ్రామానా? అనే కోణంలో విశ్లేషణలు నడుస్తున్నాయి. మొత్తానికి, తిరుచ్చి ఈస్ట్ నుండి లారెన్స్ రాజకీయ అరంగేట్రంపై వార్తలు వస్తున్న వేళ.. ఈ 'ఫేక్ ఏఐ డిప్యూటీ సీఎం' ఫొటో కోలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఫ్లైట్ జర్నీలో బ్లాక్ కలర్ సాక్స్ వేసుకోకూడదా?



విమాన ప్రయాణాల వేళ.. వీలైనంతవరకు రిలాక్స్ గా ఉండే దుస్తులు ధరించేందుకు చాలామంది ఇష్టపడతారు. మరికొందరు మాత్రం.. చాలా పక్కాగా ప్రిపేర్ అయి రావటం కనిపిస్తుంది. విదేశాల్లోని ప్రయాణికుల్ని చూసినప్పుడు విమాన ప్రయాణాల వేళ.. వారు వీలైనంతగా రిలాక్స్ వేర్ ను ధరించటం కనిపిస్తుంది. అదే సమయంలో చలిని తట్టుకునేలా జాకెట్లు.. హుడీలు ధరిస్తుంటారు. అయితే.. విమాన ప్రయాణాల వేళ.. కాళ్లకు ధరించే సాక్స్ కు సంబంధించి నల్లరంగు సాక్స్ ధరించటం సరికాదన్న మాట వినిపిస్తోంది. అందులో నిజమెంత? దీనికి కారణం ఏమిటి? అన్న విషయంలోకి వెళితే ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. విమాన ప్రయాణంలో అనుకోని సమస్యలకు నల్లరంగు సాక్స్ కారణమవుతాయా? అంటే.. అవుననే మాటను పలువురి నోటి నుంచి వినిపిస్తుంటుంది. రోజుల్లో ముఖ్యంగా రాత్రిళ్లు ప్రయాణించే వేళలో.. నల్లరంగు సాక్స్ ధరించటం సరికాదని చెబుతారు. దీనికి కారణం రాత్రి ప్రయాణాల్లో క్యాబిన్ లైటింగ్ తక్కువగా ఉండటం తెలిసిందే. ఈ సమయంలో బ్లాక్ సాక్స్ విమానపరిసరాల్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు.. రాత్రి వేళ ప్రయాణం చేసినప్పుడు షూస్ తీసేసి.. కాళ్లను ముందుకు చాచే అలవాటు చాలామందిలో ఉంటుంది. ఇలాంటప్పుడు వారు ధరించే బ్లాక్ సాక్స్ చీకట్లో కలిసిపోయే ప్రమాదం ఉంది. అలాంటి వేళలో.. క్యాబిన్ సిబ్బంది తమ సర్వీస్ లో భాగంగా అటుఇటు తిరుగుతుంటారు. అలాంటప్పుడు ప్రయాణికుల పాదాలు బ్లాక్ సాక్స్ తో కవర్ కావటంతో.. వాటిని తొక్కుప్రమాదం ఉంటుంది. అంతేకాదు..కొన్నిసార్లు సర్వీస్ ట్రాలీలు సైతం కాళ్లను ఢీ కొట్టే ప్రమాదం పొంచి ఉంది. చూసేందుకుచిన్న విషయంగా అనిపించినా.. తరచూ ట్రావెల్ చేసే వారితో పాటు.. వెకేషన్ కోసం ట్రావెల్ చేసే వారు.. తమ జర్నీ మూడ్ ను డిస్టర్బ్ చేసే అంశాలకు దూరంగా ఉండటం అవసరం. మరో అంశం ఏమంటే.. విమానాల ఫ్లోరింగ్ మీద వివిధ రకాల బ్యాక్టీరియా.. వైరస్ లు ఎక్కువ కాలం జీవించి ఉంటాయని చెబుతుంటారు. అందుకే షూస్ తీసేసి.. సాక్స్ తో నేలపై నడవటం ఆరోగ్యపరంగా సరికాదంటున్నారు. అందుకే వైట్ లేదంటే గ్రే లేదంటే లేత రంగుల సాక్స్ ను ధరించటం మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వైల్డ్‌లైఫ్‌లో బిగ్ అప్డేట్.. సిక్కింలో మిష్మి టాకిన్!



హిమాలయాల మంచు పర్వతాల్లో దాగుండే అత్యంత అరుదైన, అంతుచిక్కని వన్యప్రాణి 'మిష్మి టాకిన్' తాజాగా సిక్కింలోని బాకుచుంగ్ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది కంటికి కనిపించింది. ఒకేసారి వీటి మంద కనిపించడంతో వైల్డ్‌లైఫ్ ప్రేమికులు పండగ చేసుకుంటున్నారు. మేక, ఎద్దు కలిస్తే ఎలా ఉంటుందో అలా విచిత్రమైన రూపంతో ఉండే ఈ జీవులు కనిపించడం చాలా అరుదు. వన్యప్రాణుల సంరక్షణలో ఇదొక బిగ్ అప్‌డేట్ అని కేంద్ర మంత్రి కొనియాడారు. ఆ వివరాలు చూద్దాం..

**మేక తల.. ఆవు శరీరం.. ఇదో వింత జీవి:**

మిష్మి టాకిన్ తూర్పు హిమాలయాల్లో నివసించే అతిపెద్ద జంతువులలో ఒకటి. దీని బరువు దాదాపు 300 కిలోల వరకు ఉంటుంది. ఇక 15వ శతాబ్దానికి చెందిన ఒక బౌద్ధ సన్యాసి ఆవు శరీరాన్ని, మేక తలను కలిపి ఈ వింత జంతువును సృష్టించాడని భూటాన్ జానపద కథలు చెబుతుంటాయి. మంచు కొండల్లోని చల్లటి గాలి ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ముందే వేడెక్కేలా దీని ముక్కు, సైనస్ నిర్మాణం ప్రకృతి సిద్ధంగా ఏర్పాటయ్యింది.

**మనుషులతో విడదీయరాని బంధం:**

అరుణాచల్ ప్రదేశ్‌లోని 'ఇదు మిష్మి' అనే గిరిజన తెగ ప్రజలతో ఈ టాకిన్‌లకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఇక వీరు ఈ అడవి జీవులను తమతో పాటు ప్రకృతిని పంచుకునే తోటి ప్రాణులుగా భావిస్తారు. ఈ జంతువులను ఎప్పుడు వేటాడాలి, ఎప్పుడు వదిలేయాలి అనే విషయాలపై వారి సాంప్రదాయంలో కఠినమైన నియమాలు ఉన్నాయి. అయితే మారుతున్న కాలంతో పాటు ఈ బంధాలు కూడా ఇప్పుడు మారుతున్నాయి.

**అంతరించిపోయే ప్రమాదంలో అరుదైన జాతి:**

ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్‌ఈ మిష్మి టాకిన్‌ను 'అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవి'గా రెడ్ లిస్ట్‌లో చేర్చింది. దట్టమైన అడవుల నరికివేత, రోడ్ల నిర్మాణం, పర్యాటకం పెరిగిపోవడం వల్ల వీటి ఆవాసాలు దెబ్బతింటున్నాయి. ఇక వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా పరిశోధనల ప్రకారం, 2070 నాటికి వాతావరణ మార్పుల వల్ల వీటి నివాస స్థలాలు చాల వరకు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

**తొలిసారిగా మెగా సర్వే షురూ:**

ఈ అరుదైన జీవుల జనాభాను, అవి ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో తెలుసుకోవడానికి వైల్డ్‌లైఫ్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అరుణాచల్, సిక్కిం పరిసర ప్రాంతాల్లో ఒక భారీ సర్వేను ప్రారంభించింది. వీటి రహస్య ప్రవర్తన కారణంగా వీటిపై ఇప్పటివరకు పెద్దగా పరిశోధనలు జరగలేదు. ఇక ఇప్పుడు జరుగుతున్న సర్వే ద్వారా ఈ జీవులను ఎలా కాపాడుకోవాలో ఒక స్పష్టమైన ప్లాన్ దొరుకుతుందని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

సిక్కిం కొండల్లో మిష్మి టాకిన్ గుంపు కనిపించడం అనేది కేవలం ఒక అరుదైన దృశ్యం మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతకు ఇదొక శుభసూచకం. ఇక ప్రకృతి అందాలతో పాటు ఇలాంటి అపురూపమైన జీవులను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఇక అటవీ సంరక్షణ చర్యలు మరింత పటిష్టంగా సాగితేనే ఈ హిమాలయ వింత జీవులు భవిష్యత్ తరాలకూ సజీవంగా కనిపిస్తాయి.

# ప్రియాంక బెటర్ అంటున్నారు...ఎందువల్ల ?



కాంగ్రెస్ పార్టీలో వారసత్వం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది. వారసత్వ నాయకులు కూడా పెద్దగా ఆలస్యం లేకుండా నేరుగా ప్రధానమంత్రి కుర్చీలోనే కూర్చోవడం గత మూడు తరాలుగా అంతా చూశారు. నెహ్రూ వెంటనే ఉండి ఆయన ఉండగానే రాజ్యసభకి నెగ్గి నెహ్రూ రాజకీయ కార్యదర్శిగా శ్రీమతి ఇందిరాగాంధీ పనిచేశారు. అలా మెలకువలు అన్నీ నేర్చుకుని తండ్రి మరణం తరువాత కేవలం రెండేళ్ళ వ్యవధిలో ఇందిరాగాంధీ దేశానికి ప్రదహాని అయ్యారు. ఇక ఆమె మరణం తరువాత రాజీవ్ గాంధీ కూడా వెంటనే ప్రధాని అయిపోయారు. కానీ రాజీవ్ మరణించి మూడున్నర దశాబ్దాలు కావస్తున్నా ఆయన వారసులకు ప్రధాని పదవి అందని పండుగా మారుతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది కారణాలు ఏమిటి అన్నది కాంగ్రెస్ పార్టీలోనే కాదు బయట మిత్రులలోనూ చర్చ సాగుతోంది.

**అవకాశం ఉన్నపుడు అలా :**

ఇక 2004లో యూపీలో కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చింది. అపుడే అమేధీ నుంచి రాహుల్ గాంధీ కూడా గెలిచి వచ్చారు. మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారు. ఆయన మంత్రివర్గంలో చేరి అయిదేళ్ల పాటు రాహుల్ పనిచేసి ఉంటే 2009 నాటికి ప్రధాని అయ్యే అవకాశం ఉండేదని కాంగ్రెస్ వర్గాలలోనే అంటూంటారు. కానీ రాహుల్ ఎందుకో మొదట్లో అంతగా ఆసక్తిని కనిపించలేదు. ఇక 2009లో రెండోసారి మన్మోహన్ సింగ్ ప్రధాని అయిన తరువాత అయినా రాహుల్ మంత్రిగా చేరి చివరి రెండేళ్ళు అయిన ప్రధానిగా చేస్తే కాంగ్రెస్ కి ఈ దుస్థితి వచ్చేది కాదని అంటారు. బాధ్యతలను తీసుకునే విషయంలో రాహుల్ మొదటి నుంచి అనాసక్తిని కనబరచడం వల్లనే కాంగ్రెస్ ఈ రోజున వంద సీట్లకు కూడా దక్కక అధికారం ఎండమావిగా మారిపోతోంది అని అంటున్నారు.

**వ్యవహార శైలి మీద :**

రాహుల్ గాంధీ కోటరీ ఎవరో తెలియదు కానీ ఆయన సులువుగా మిత్రులను దగ్గర వారిని దూరం చేసుకుంటారు అని అంటున్నారు. అస్సాం లో ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కాంగ్రెస్ లోనే ఉండేవారు. ఆయన మంత్రిగా కూడా చేశారు. ఆయనను దూరం చేసుకోవడం ద్వారా ఏకంగా ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ ప్రాభవానికి కాంగ్రెస్ కారణం అయింది అని అంటారు. అంతే కాదు మధ్యప్రదేశ్ లో వృద్ధ నాయకులను ప్రోత్సహించి యువ నేత జ్యోతిరాదిత్య సింధియాను దూరం చేసుకోవడం వల్లనే గత రెండు దశాబ్దాలుగా అక్కడ కాంగ్రెస్ అధికారం అందుకోవడం లేదని అంటున్నారు. గుజరాత్ లో అయితే మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ అధికారంలో లేదు, రాజస్థాన్ లో కూడా సచిన్ పైలెట్ ని ముందు పెడితే కాంగ్రెస్ కి మంచి రోజులు వచ్చేవని చెప్పినా రాహుల్ పట్టించుకోలేదని అంటారు.

**మిత్రులతోనూ అదే తీరు :**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ తో పోటా పోటీగా బరిలోకి దిగి బీజేపీకి చాన్స్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ది అని అంటారు. అందుకే కేజ్రీవాల్ దూరం అయిపోయారు. ఇక తమిళనాడులో కూడా డీఎంకే వంటి నమ్మకమైన మిత్రుడిని దూరం పెట్టడం దీర్ఘకాలంలో మంచి వ్యూహం కాదని చెబుతారు. కేరళలో వామపక్షాలతో రాహుల్ వ్యవహరించిన తీరు మీద ఎర్ర పార్టీలు గుర్రుగా ఉన్నాయి. యూపీ బీహార్ లలో యాదవుల నాయకత్వంలోని పార్టీల విషయంలో కాంగ్రెస్ నుంచి రావాల్సిన సహకారం దక్కడం లేదని అంటారు. మొత్తంగా చూస్తే రాహుల్ గాంధీ దూకుడుతో తీసుకునే నిర్ణయాల వల్ల మిత్రులే దూరం అవుతున్నారు. ఇక 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రాహుల్ గాంధీ తీరా ఓటమి చెందగానే పగ్గాలు వదిలేశారు. అది నాయకుడి లక్షణం కాదని అంటారు.

**పగ్గాలు అందుకోవాల్సిందే :**

ఈ రోజుకీ మల్లిఖార్జున ఖర్గెని పెట్టి రాహుల్ నడిపిస్తున్న ఈ తరహా రాజకీయం వల్ల కాంగ్రెస్ ఎత్తిగిల్లడం లేదని అంటున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పీఠం మీద గాంధీ వంశీకులు ఉంటే వచ్చే ఇమేజ్ వేరు అని అంటున్నారు. కానీ దానికి రాహుల్ గాంధీ సిద్ధంగా లేరు అన్నది తెలుస్తూనే ఉంది. ఈ సమయంలో ప్రియాంకా గాంధీ సరైన నాయకురాలుగా కాంగ్రెస్ లోనూ భావిస్తున్నారు. ఆమెకే పగ్గాలు అప్పగిస్తే కచ్చితంగా కాంగ్రెస్ కి ఎంతో కొంత వైభవం వస్తుందని అంటున్నారు. ఆమె డేరింగ్ అండ్ డేషింగ్ నేచర్ కాంగ్రెస్ కి కలసి వస్తుందని చెబుతున్నారు. కాంగ్రెస్ ఎంపీగా లోక్ సభలో ప్రియాంక ప్రసంగాలు కూడా ప్రంశలు పొందుతున్నాయని చెబుతున్నారు. మొత్తానికి రాహుల్ గాంధీ విషయంలో మిత్రులతో పాటు సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రియాంక గాంధీకి పగ్గాలు అప్ప చెబుతారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

# షాకింగ్: 'కాక్రోచ్ పార్టీ' ఫౌండర్‌పై దాడి చేసిన నిందితులకు పూలమాలలతో ఘన స్వాగతం!



దేశవ్యాప్తంగా యువతలో అమితమైన క్రేజ్ సంపాదించుకున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఫౌండర్ అభిజీత్ దీప్కేపై జైపూర్‌లో జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. జూన్ 15న జైపూర్ లో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో దీప్కేను చెంపదెబ్బలు కొట్టి జైలుకు వెళ్లిన నిందితులను పోలీసులు బుధవారం విడుదల చేశారు. జైపూర్‌లోని విద్యాక్‌పురి పోలీస్ స్టేషన్ నుంచి కేవలం రూ. 20 వేల వ్యక్తిగత పూచీకత్తుపై వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే పోలీసు స్టేషన్ బయట నిందితులకు పూలమాలలతో స్వాగతం పలకడం చర్చనీయాంశంగా మారింది.

**పోలీస్ స్టేషన్ ముందే ఘన స్వాగతం!**

నిందితులు బెయిల్‌పై బయటకు రాగానే పోలీస్ స్టేషన్ వెలుపల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిందితుల మద్దతుదారులు వారికి పూలమాలలు వేసి, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'జైశ్రీరాం', 'భారత్ మాతా కీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారని చెబుతున్నారు. ఈ ఉదంతానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

**అసలేం జరిగింది?**

దేశంలో నిరుద్యోగం, అవినీతి, నీట్ పేపర్ లీక్ తదితర అంశాలపై సీజేపీ ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా నీట్ పేపరు లీకేజీకి సంబంధించి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న జైపూర్ లో నిర్వహించిన ధర్నాకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వచ్చారు. అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలకగా, వారి సమక్షంలో ఓ యువకుడు అభిజిత్ దీప్కే చెంప చెల్లు మనిపించాడు. ఈ పరిణామంతో షాక్ తిన్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ కు తరలించారు.

**రాజకీయ రంగు పులుముకున్న దాడి**

కాగా, ఈ దాడికి పాల్పడిన వారు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు చెందినవారని అభిజీత్ దీప్కే ఆరోపించారు. కాగా, ఈ దాడిపై దీప్కే సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా తాను గాంధీ, అంబేద్కర్ మార్గంలో నడిచేవాడిని. యువత హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం కొనసాగిస్తానని ప్రకటించారు. ప్రశ్నించే వారిని పాకిస్తానీయులు అంటూ ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి బెదిరింపులకు మేము లొంగమని తేల్చిచెప్పడంతోపాటు జూన్ 20న 'ఢిల్లీ చలో' కార్యక్రమంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**ట్రెండింగ్‌లో 'కాక్రోచ్ జనతా పార్టీ'**

బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేసిన 30 ఏళ్ల పొలిటికల్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దీప్కే ఈ వినూత్న కాక్రోచ్ జనతా పార్టీని స్థాపించారు. నిరుద్యోగ యువతను ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా వ్యంగ్యాస్త్రాలతో ప్రారంభమైన ఈ డిజిటల్ ఉద్యమం, ప్రస్తుతం వీధుల్లోకి వచ్చి దేశవ్యాప్త యువజన ఉద్యమంగా రూపాంతరం చెందిందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే తాజా దాడి జరగడం, నిందితులకు ఘన స్వాగతం లభించడం దేశవ్యాప్తంగా సంచలన చర్చకు దారితీసింది.

# ట్రైనింగ్ ఇచ్చినా AI వాడట్లేదని 80% టెక్కీలను పీకేసిన సీఈఓ.. ఏ కంపెనీలో అంటే?




AI స్కిల్స్ నేర్చుకోకపోతే ఉద్యోగాలు ఊడిపోతాయనే హెచ్చరికలు మనం రోజూ వింటూనే ఉన్నాం. కానీ ఒక టెక్ కంపెనీ సీఈఓ దీనిని నిజం చేసి చూపించారు. ఏఐ టెక్నాలజీపై ట్రైనింగ్ ఇప్పించినా దానిని వాడటానికి నిరాకరించినందుకు తన కంపెనీలోని ఏకంగా 80 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపించేశారు. టెక్సాస్‌కు చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ 'ఇగ్నైట్‌టెక్' సీఈఓ ఎరిక్ వాఘన్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం ఇప్పుడు టెక్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది.

తన కంపెనీని 'ఏఐ-ఫస్ట్' ఆర్గనైజేషన్‌గా మార్చాలనేది ఎరిక్ వాఘన్ బలమైన సంకల్పం. దీనికోసం ఉద్యోగులకు భారీగా అవకాశాలు ఇచ్చారు. కంపెనీ మొత్తం పేరోల్‌లో దాదాపు 20 శాతం బడ్జెట్‌ను కేవలం ఉద్యోగుల అప్‌స్కిల్లింగ్ కోసమే కేటాయించారు. మూడు నెలల పాటు వారానికి ఒక రోజును కేవలం ఏఐ ట్రైనింగ్ కోసమే కేటాయించి, ఉద్యోగులకు జీతాలు ఇస్తూ మరీ శిక్షణ ఇప్పించారు. దీనికి తోడు ఏఐ టూల్స్ నేర్చుకునే వారికి ప్రత్యేక ఇన్సెంటివ్‌లు కూడా ఆఫర్ చేశారు.ఇంత చేసినా సరే.. కంపెనీలోని మెజారిటీ ఉద్యోగులు

ఏఐ వైపు అడుగులు వేయడానికి ఆసక్తి చూపించలేదు. తాము అంత సమయం, డబ్బు ఖర్చు చేసి ట్రైనింగ్ ఇస్తున్నా.. 'నేను ఏఐ వాడను, నేర్చుకోను' అని కొందరు ఉద్యోగులు మొండికేసారని ఎరిక్ ఆవేదన వ్యక్తం చేశారు. టీమ్ ఆలోచనలు కంపెనీ వ్యూహాలతో సింక్ కానప్పుడు.. ఎంత ట్రైనింగ్ ఇచ్చినా.. ఎలాంటి స్ట్రాటజీలు వాడినా లాభం లేదని తెలుసుకున్నాడు.

కంపెనీ భవిష్యత్తు కోసం వేరే దారి లేక, ఏఐ వాడటానికి తిరస్కరించిన 80 శాతం మంది సిబ్బందిని తొలగించి, వారి స్థానంలో ఏఐ టెక్నాలజీపై పట్టున్న కొత్తవారిని నియమించుకున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం చాలా కష్టమైనప్పటికీ తప్పలేదన్నారు సీఈఓ. ఒకవేళ తాను మళ్లీ మొదటి నుంచి ఈ ప్రాసెస్ మొదలుపెట్టాల్సి వస్తే.. ట్రైనింగ్‌లు ఇస్తూ సమయం వృథా చేయకుండా, ఏఐ నేర్చుకోనని చెప్పిన వారిని మొదటి రోజే తీసేసేవాడినని ఓపెన్‌గా చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ అవ్వకపోతే ఎంతటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగమైనా రిస్క్‌లో పడుతుందని చెప్పడానికి ఇదొక లైవ్ ఎగ్జాంపుల్.

# హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారా? ఫ్యామిలీ Vs ఇండివిడ్యువల్ మధ్య తేడాలు తెలియకపోతే నష్టపోతారు

హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ప్రతి కుటుంబానికి అత్యవసరమైన ఒక ఫైనాన్షియల్ ప్రొటెక్షన్. అయితే పాలసీ తీసుకునేటప్పుడు చాలామంది ఎదుర్కొనే అతిపెద్ద కన్ఫ్యూజన్.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవాలా? లేక అందరికీ విడివిడిగా ఇండివిడ్యువల్ ప్లాన్స్ తీసుకోవాలా? అని. ఈ రెండు ప్లాన్ల మధ్య ఉన్న తేడాలు.. వాటి వల్ల కలిగే లాభనష్టాలు క్లియర్ గా తెలుసుకుంటే భవిష్యత్తులో డబ్బుతో పాటు టెన్షన్ కూడా ఆదా అవుతుంది.

**ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ అంటే ఏంటి?**

ఈ ప్లాన్‌లో కుటుంబ సభ్యులందరికీ కలిపి ఒకే ఒక హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుంది. ఉదాహరణకు మీరు రూ.5 లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకుంటే.. ఆ రూ.5 లక్షల మొత్తాన్ని కుటుంబంలో ఉన్న ఎవరైనా, ఎంతైనా వాడుకోవచ్చు. ఒకే సంవత్సరంలో ఒకరి కంటే ఎక్కువ మంది హాస్పిటల్ పాలైనా ఈ సింగిల్ కవరేజ్ నుంచే క్లెయిమ్ చేసుకోవాలి. యువకులు, ఆరోగ్యంగా ఉండే చిన్న కుటుంబాలకు ఇది బెస్ట్ ఆప్షన్.

**ఇండివిడ్యువల్ ప్లాన్ అంటే ఏంటి?**

ఈ ప్లాన్ పేరులోనే ఉన్నట్టుగానే ఫ్యామిలీలో ఉన్న ప్రతి ఒక్కరికీ విడివిడిగా సపరేట్ కవరేజ్ అమౌంట్ ఉంటాయి. ఒకరికి ఇచ్చిన కవరేజ్ మొత్తాన్ని కుటుంబంలోని మిగతా సభ్యులు వాడుకోవడానికి వీలుండదు. ఎవరి పరిమితి వారికి ఉంటుంది. కాబట్టి ఒకరు పెద్ద మొత్తంలో క్లెయిమ్ చేసినా.. మిగతా వారి కవరేజ్ అలాగే ఉంటుంది.

**ఖర్చు ఎందులో తక్కువ?**

బడ్జెట్ విషయానికి వస్తే.. ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్స్ చాలా చౌకగా




లభిస్తాయి. ఒకే ప్రీమియంతో భార్యాభర్తలు, పిల్లలను కవర్ చేయవచ్చు. అదే ఇండివిడ్యువల్ ప్లాన్స్ అయితే ప్రతి ఒక్కరికీ విడివిడిగా ప్రీమియం కట్టాలి కాబట్టి ఖర్చు కొంచెం ఎక్కువగా ఉంటుంది.

**తల్లిదండ్రులను యాడ్ చేయవచ్చా?**

ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకునేటప్పుడు లేదా రెన్యూవల్ చేసేటప్పుడు తల్లిదండ్రులను డిపెండెంట్స్‌గా యాడ్ చేసుకోవచ్చు. కానీ పాలసీలో సీనియర్ సిటిజన్లు ఉంటే ప్రీమియం రేట్లు విపరీతంగా పెరిగిపోతాయి. పైగా వయసు పైబడిన వారికి తరచూ వైద్య సేవలు అవసరమవుతాయి కాబట్టి, వారు ఎక్కువ మొత్తం క్లెయిమ్ చేస్తే పిల్లలకు కవరేజ్ మిగలకపోవచ్చు. అందుకే తల్లిదండ్రులకు విడిగా ఇండివిడ్యువల్ పాలసీ తీసుకోవడమే సేఫ్.

**మీకు ఏది కరెక్ట్?**

హెల్త్ ఇన్సూరెన్స్‌లో అందరికీ ఒకే రూల్ వర్తించదు. మీ కుటుంబంలో అందరూ యంగ్‌గా ఉండి, మెడికల్ రిస్క్‌లు తక్కువగా ఉంటే.. తక్కువ ప్రీమియంతో వచ్చే 'ఫ్యామిలీ ఫ్లోటర్' ప్లాన్ ఎంచుకోవడం స్మార్ట్ ఛాయిస్. అలా కాకుండా ఇంట్లో పెద్దవాళ్లు ఉన్నా, లేదా ఎవరికైనా తరచూ చికిత్సలు అవసరమయ్యే ఆరోగ్య సమస్యలు ఉన్నా.. 'ఇండివిడ్యువల్' ప్లాన్స్ వైపు వెళ్లడమే అత్యుత్తమం. మీ ఫ్యామిలీ వయస్సు, ఆరోగ్య పరిస్థితులను బట్టి సరైన నిర్ణయం తీసుకోండి.

# టాటా సన్స్ చైర్మన్ సంచలన నిర్ణయం: లాభాలు తగ్గడంతో శాలరీ హైక్ త్యాగం

టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ కార్పొరేట్ ప్రపంచంలో ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆయన తన జీతం పెంపును సున్నితంగా తిరస్కరించారు. టాటా సన్స్ బోర్డు మీటింగ్‌లో భాగంగా జరిగిన నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ సమావేశంలో.. ఈ ఏడాది తనకు ఎలాంటి శాలరీ హైక్ వద్దంటూ స్వయంగా ప్రకటించినట్లు తెలుస్తోంది. కొత్త బిజినెస్‌లలో లాభాలు తగ్గడం, ఇన్వెస్ట్‌మెంట్లపై ఒత్తిడి పెరుగుతున్న వేళ ఈ డెసిషన్ తీసుకున్నారు.

దేశంలోనే అత్యధిక జీతం తీసుకునే టాప్ బిజినెస్ లీడర్లలో చంద్రశేఖరన్ ఒకరు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.156 కోట్ల రెమ్యునరేషన్ అందుకున్నారు. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 15 శాతం ఎక్కువ. ఈ రూ.156 కోట్లలో బేసిక్ శాలరీ, బెనిఫిట్స్ కలిపి కేవలం రూ.15 కోట్లు మాత్రమే. మిగిలిన రూ.141 కోట్లు కంపెనీ లాభాల ఆధారంగా వచ్చే ప్రాఫిట్-లింక్డ్ కమిషన్. అంటే ఆయన ప్యాకేజీ పూర్తిగా కంపెనీల పర్ఫార్మెన్స్‌పైనే ఆధారపడి ఉంటుంది.అయితే ప్రస్తుతం టాటా గ్రూప్ ఒక విచిత్రమైన పరిస్థితిని




ఎదుర్కొంటోంది. గ్రూప్ ఆదాయం భారీగా పెరుగుతున్నప్పటికీ.. లాభాల విషయంలో మాత్రం కాస్త బ్రేకులు పడ్డాయి. ఫీ25లో టాటా సన్స్ రెవెన్యూ 24% పెరిగి రూ.5లక్షల 92వేల కోట్లకు చేరింది. కానీ నికర లాభం మాత్రం 17% తగ్గి రూ.28వేల 898 కోట్లకు పడిపోయింది. అంతేకాదు ఈ మొత్తం లాభంలో దాదాపు 43% వాటా కేవలం ఒక్క టీసీఎస్ నుంచే వస్తుండటంతో టెన్షన్ స్టార్ట్ అయ్యింది. ఐటీ రంగంపై ఏఐ ప్రభావంతో భవిష్యత్తు ఆదాయాలపై కూడా నీలినీడలు అలుముకుంటున్నాయి.

మరోవైపు, టాటా గ్రూప్ కొత్తగా పెట్టిన నయా-తరం బిజినెస్‌లలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. దీనిపై టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా మొదట్లో కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. దేశ నిర్మాణంలో కీలకమైన 'టాటా ఎలక్ట్రానిక్స్' ఎదుగుదలను ఆయన అభినందించారు. ఈ నేపథ్యంలో, గ్రూప్ లాభాలను సమన్వయం చేస్తూ, కొత్త వ్యాపారాలను లాభాల్లోకి తేవడమే లక్ష్యంగా చంద్రశేఖరన్ ఈ శాలరీ హైక్ త్యాగం చేశారు. లీడర్ అంటే కేవలం లాభాలు పంచుకోవడం కాదు.. కంపెనీ కష్టాల్లో ఉన్నప్పుడు బాధ్యత తీసుకోవడం కూడా అని ఆయన మరోసారి నిరూపించారు.

# పిజ్జాకు బ్రాండ్ వేసిన పిజ్జా హట్.. చేతులు మారిన 70 ఏళ్ల చరిత్ర.. ఎన్ని వేల కోట్లకు అమ్మారో తెలిస్తే షాక్..!




ప్రపంచవ్యాప్తంగా పిజ్జా లవర్స్‌కు అత్యంత పరిచయమున్న బ్రాండ్ 'పిజ్జా హట్' ఇప్పుడు చేతులు మారింది. దాదాపు 6 దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానానికి ముగింపు పలుకుతూ.. దీని పేరెంట్ కంపెనీ 'యమ్ బ్రాండ్స్' పిజ్జా హట్‌ను అమ్మేయడానికి సిద్ధమైంది. ఈ మెగా డీల్ విలువ అక్షరాలా 2.7 బిలియన్ డాలర్లు.. అంటే మన భారత కరెన్సీలో సుమారు రూ.25వేల 476 కోట్లు. గత కొన్ని ఏళ్లుగా అమ్మకాలు మందగించడం, తీవ్రమైన పోటీని తట్టుకోలేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.యమ్ బ్రాండ్స్ పోర్ట్‌ఫోలియోలో ఖఫీజ, టాకో బెల్ వంటి పవర్‌ఫుల్ బ్రాండ్స్ ఉన్నప్పటికీ.. పిజ్జా హట్ మాత్రం గత కొంతకాలంగా వీక్ పర్ఫార్మెన్స్‌తో ఇబ్బంది పడుతోంది. నష్టాలను తగ్గించుకోవడానికి ఇప్పటికే అమెరికాలో దాదాపు 250 స్టోర్లను మూసివేయాలని ప్లాన్ చేశారు. అయితే పిజ్జా హట్‌ను మళ్లీ గాడిన పెట్టాలంటే భారీ పెట్టుబడులతో పాటు మార్పులు అవసరమని, అంత రిస్క్ తీసుకోలేకే దీన్ని అమ్మేయాలని యమ్ బ్రాండ్స్ నిర్ణయించుకుందట.

చైనా మినహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పిజ్జా హట్ బిజినెస్‌ను ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 'లాంగ్‌రేంజ్ క్యాపిటల్' సుమారు రూ.14వేల 153 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇక చైనాలోని ఆపరేషన్లను మాత్రం 'యమ్ చైనా హోల్డింగ్స్' విడిగా దాదాపు రూ.11వేల 323 కోట్లకు సొంతం చేసుకుంటోంది. ఈ రెండు డీల్స్ కలిపి మొత్తం విలువ రూ.25వేల 476 కోట్లుగా నిలిచింది.

**68 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం..**

1958లో అమెరికాలోని కాన్సాస్‌లో ప్రారంభమైన పిజ్జా హట్.. ఒకప్పుడు పిజ్జా మార్కెట్‌ను శాసించింది. కానీ మారుతున్న కస్టమర్ల అభిరుచులు, డిజిటల్ ఆర్డరింగ్ సిస్టమ్స్, ఫుడ్ డెలివరీ యాప్స్ స్పీడ్‌ను అందుకోవడంలో ఈ బ్రాండ్ వెనుకబడింది. పాతకాలపు స్టోర్ ఫార్మాట్లు కూడా దీనికి మైనస్ అయ్యాయి. అయితే కొత్త ఓనర్ల ఆధ్వర్యంలో సరికొత్త టెక్నాలజీతో.. ఆధునిక స్టోర్లతో పిజ్జా హట్ మళ్లీ కంబ్యాక్ ఇస్తుందని కంపెనీ సీఈఓ క్రిస్ టర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. చూద్దాం మరి.. రాబోయే రోజుల్లో పిజ్జా హట్ బిజినెస్ స్టోరీ ఎలాంటి క్రేజీ టర్న్ తీసుకుంటుందో.

# అద్దె ఇంట్లో ట్యాప్ లీకైనా.. గోడ పగిలినా రిపేర్స్ ఖర్చు ఎవరు భరించాలి? రూల్స్ ఏం చెబుతున్నాయి?




ఈ రోజుల్లో ఇల్లు మారడం అంటే కేవలం సామాన్లు సర్దుకోవడం మాత్రమే కాదు. కొత్త బాధ్యతలను నెత్తినేసుకోవడం. అద్దెకు దిగిన ఇంట్లో అర్ధరాత్రి ట్యాప్ లీకైనా, గోడకు పగుళ్లు వచ్చినా.. 'ఎవరిది బాధ్యత?' అనే గొడవ ప్రతిచోటా కామనే. యజమానిదా? కిరాయిదారుదా? ఈ తలనొప్పికి చెక్ పెడుతూ.. ఇండియా తీసుకొచ్చిన 'మోడల్ టెనెన్సీ యాక్ట్, 2021' క్లారిటీ ఇచ్చింది. ఆ రూల్స్ తెలిస్తే లీగల్ చిక్కులు లేకుండా ప్రశాంతంగా ఉండొచ్చు.

**ఇల్లు యజమానిదే బాధ్యత:**

ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు ఎలా ఉందో.. అలాగే ఉంచడం ఇద్దరి బాధ్యత. అయితే మేజర్ రిపేర్లు, మెయింటెనెన్స్ అంతా యజమానిదే. ఒకవేళ ఓనర్ ఆ పనులు చేయనని మారాం చేస్తే.. టెనెంట్ ఆ రిపేర్లు తనే చేయించుకోవచ్చు. ఆ ఖర్చును నెలవారీ అద్దెలో డిడక్ట్ కట్ చేసుకోవచ్చు. కానీ ట్విస్ట్ ఏంటంటే.. ఆ తగ్గింపు నెలకు 50% మించకూడదు. ఒకవేళ ఇల్లు అసలుండటానికే పనికిరానంతగా పాడైతే.. 15 రోజుల నోటీస్ ఇచ్చి టెనెంట్ ఖాళీ చేయవచ్చు.

**టెనెంట్ ఏం చేయాలి?:**

అద్దెకున్నంత మాత్రాన ఇష్టమొచ్చినట్టు ఇంటిని వాడేస్తామంటే కుదరదు. కావాలని గానీ, నిర్లక్ష్యంగా గానీ ఇంటిని పాడుచేయకూడదు. ఏదైనా డ్యామేజ్ జరిగితే వెంటనే ఓనర్‌కు లిఖితపూర్వకంగా చెప్పాలి. ఇంటిని జాగ్రత్తగా చూసుకోవడం టెనెంట్ డ్యూటీ. ఒకవేళ టెనెంట్ చేయాల్సిన రిపేర్లు చేయకపోతే.. ఓనరే ఆ పని చేసి, ఆ ఖర్చును సెక్యూరిటీ డిపాజిట్ నుంచి కట్ చేసుకుంటారు. ఆ ఖర్చు డిపాజిట్ కంటే ఎక్కువైతే.. నోటీస్ అందిన నెల రోజుల్లో టెనెంట్ దాన్ని చెల్లించాలి.

**ప్రకృతి వైపరీత్యాలు వస్తే?:**

వరదలు, అగ్నిప్రమాదాలు, తుఫానుల వంటి వాటి వల్ల ఇల్లు దెబ్బతింటే సీన్ మారుతుంది. ఇల్లు మళ్లీ బాగుపడే వరకు ఓనర్ రెంట్ అడగకూడదు. ఒకవేళ ఆ ఇల్లు ఇక రిపేర్ చేయలేనంతగా పాడైపోతే.. అడ్వాన్స్ రెంట్, సెక్యూరిటీ డిపాజిట్‌ను నోటీస్ గడువు ముగిసిన 15 రోజుల్లోగా టెనెంట్‌కు ఓనర్ తిరిగి ఇచ్చేయాల్సిందేనని చట్టం చెబుతోంది. అంటే అతని చేతిలో లేని వైపరీత్యాలకు అద్దెకు ఉన్న వ్యక్తి బాధ్యత తీసుకోనక్కర్లేదన్నమాట.

# సిరుల అన్నం..మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివె

"సూపర్ ఫుడ్, వండర్ గ్రెయిన్".. మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివి. "హై కార్బ్, మూడు పూటలా తింటే వెరీ డేంజర్".. ఇవి అన్నం ప్రస్తావన వచ్చినప్పుడు చెప్పే మాటలు. అయినా.. జనాలు అన్నమే ఎందుకు తింటున్నరు అంటే దీనికి చాలా కారణాలు ఉన్నయ్. హరిత విప్లవం నుంచి ప్రభుత్వ విధానాల వరకు అన్ని అన్నానికే ఓటేశాయ్?. ఇప్పుడు 'యూ' టర్న్ తీసుకుని మళ్లీ పాత పద్ధతులే మేలు అంటున్నరు ఎక్స్?పర్ట్స్?. ఒకప్పుడు పేదల ఆకలిని తీర్చిన ఈ చిరు ధాన్యాలు ఇప్పుడు వాళ్లకే దూరమైనయ్?. అందుకే వాటిని మళ్లీ అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఐక్యరాజ్య సమితితోపాటు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నయ్?. అందులో భాగంగానే అందరూ మధ్యాహ్న భోజనంగా మిల్లెట్స్? తీసుకోవాలని మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా చెప్తున్నరు.

పల్లెల్లో పెద్దవాళ్లు "పండుగలు, పబ్బాలకే తెల్లన్నం తినేటోళ్లం. మిగతా రోజుల్లో తైద అంబలి, జొన్న రొట్టెలు, సామల అన్నమే దిక్కు" అని చెప్తుంటారు. తర్వాత ఆ పరిస్థితి నుంచి.. రోజూ అన్నం తిని ఎప్పుడో ఒకసారి మిల్లెట్స్? తినే పరిస్థితికి వచ్చారు. కానీ.. ఇప్పుడు మళ్లీ పాత అలవాట్లే మంచివని, మిల్లెట్స్? తినాలని న్యూట్రిషనిస్ట్?లు చెప్తున్నారు. అంతెందుకు మన ప్రధానితోపాటు ఐక్యరాజ్య సమితి కూడా 'చిరు ధాన్యాలతోనే ఆరోగ్య సిరి' అంటోంది. అసలు మిల్లెట్స్?లో ఏముంది? నిజంగానే వాటిని తినాల్సిన అవసరం ఉందా? అన్నీ తెలిసినా అన్నమే ఎందుకు తింటున్నారు?

### ఎన్విరాన్‌మెంట్‌కు మంచిది

మిల్లెట్స్? సాగు మనకే కాదు.. ఎన్విరాన్?మెంట్?కు కూడా మేలు చేస్తుందని సైంటిస్ట్?లు అంటున్నారు. "ఇప్పుడు తింటున్న ధాన్యాల దిగుబడిని పెంచడం, వాటిని చీడల నుంచి తట్టుకునే విధంగా డెవలప్? చేయడం కంటే.. వాటితోపాటు చిరు ధాన్యాలను పండించి, తినడం మంచిద"ని చెప్తున్నారు. అలా చేయడం ఎన్విరాన్?మెంట్?కు కూడా మంచిదని నిరూపించారు. 2019లో ఇండియాలో కొంత విస్తీర్ణంలో వరి సాగుకు బదులు మిల్లెట్స్? (సజ్జలు, జొన్నలు లాంటివి) వేసి, పరిశీలించారు. అప్పుడు సైంటిస్ట్?లు ఈ పంటలు వరితో పోలిస్తే తక్కువ గ్రీన్?హౌజ్? గ్యాస్?ను విడుదల చేస్తాయని, వాతావరణంలో మార్పులు రాకుండా కాపాడేందుకు ఈ పంటలు ఉపయోగపడతాయని తెలుసుకున్నారు. వరితో పోలిస్తే.. నీళ్లు, శ్రామిక శక్తి కూడా తక్కువ అవసరం అవుతాయని చెప్పారు. ఈ పంటలు పండడానికి సింథటిక్ ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. కాబట్టి కెమికల్? ఫ్రీ. దాదాపు అన్ని రకాల మిల్లెట్స్?కి పైపొర చాలా గట్టిగా ఉంటుంది. ఇవి చాలా చిన్న సైజ్?లో ఉంటాయి. అందుకే కరువు, తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి.

### ఎక్కడైనా పండుతాయి

వరి, గోధుమలతో పోలిస్తే తక్కువ టైంలో పండుతాయి. చాలా రకాల మిల్లెట్స్ 70%--%100 రోజుల్లో పండుతాయి. కానీ.. వరి, గోధుమలు పండడానికి 120%--%-150 రోజులు పడుతుంది. అంతేకాదు వరి, గోధుమలతో పోలిస్తే వీటిని పండించడానికి నీళ్ల అవసరం తక్కువే. మిల్లెట్స్? పండడానికి తక్కువలో తక్కువ 350%--%500 మిల్లీమీటర్లు వర్షపాతం అవసరం. అదే వరి, గోధుమలకు అయితే 600-%--%1,200 మిల్లీమీటర్ల వర్షం కావాలి. అంటే తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో కూడా మిల్లెట్స్? పండుతాయి. కొండ ప్రాంతాల్లో కూడా పండించొచ్చు.

కర్నాటకలోని తుంకూరుకు 70 కి.మీ దూరంలో సిరా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో హొూండూరే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కోరలె రఘు అనే రైతు ప్రతి ఏడాది వానాకాలంలో మొక్కజొన్న పండిస్తుంటాడు. ఆ ప్రాంతంలో నీటికి చాలా కరువు ఉంటుంది. ఎక్కువమంది వర్షం మీద ఆధారపడి సాగు చేస్తుంటారు. ప్రతిసారి సరిగ్గా వర్షాలు పడకపోవడంతో పంటలు సరిగా పండేవి కాదు. దాంతో కొన్నేండ్ల క్రితం రఘు అందు కొర్రల సాగు మొదలుపెట్టాడు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. వర్షాలు పెద్దగా పడకపోయినా మంచి దిగుబడి వస్తోంది. 2011లో మొదటిసారి ఎనిమిదిన్నర ఎకరాల్లో అందు



కొర్రలు సాగు చేశాడు. అప్పుడు 80 క్వింటాళ్ల దిగుబడిని సాధించాడు. ఆ తర్వాత దిగుబడి మరింత పెరిగింది. పంటలో కొంత భాగం తోటి రైతులకు విత్తనాల కోసం అమ్ముతున్నాడు. మిగతా పంటను మార్కెట్?లో అమ్ముతున్నాడు. రఘును చూసి ఎంతోమంది రైతులు నీళు న్నా కూడా మిల్లెట్స్? సాగు చేయడానికే ఇష్టపడుతున్నారు. హొూండూరేలో ఇప్పుడు చాలామంది రైతులు అందు కొర్రలు పండిస్తున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

కొన్నేండ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్స్?కి డిమాండ్? ఏర్పడింది. అందులోనూ కరోనా తర్వాత డిమాండ్? మరింత పెరిగింది. కానీ.. డిమాండ్?కు సరిపడా ప్రొడక్షన్? లేకపోవడంతో కొన్ని రకాల మిల్లెట్స్? ధరలు పెరుగుతున్నాయి. అందుకే ఈ వెలితిని భర్తీ చేసేందుకు యూఎన్?వోతో పాటు చాలా దేశాలు పనిచేస్తున్నాయి. మిల్లెట్? సాగు విస్తీర్ణం, ప్రొడక్షన్?లో మన దేశానికి 19 శాతం గ్లోబల్? షేర్ ? ఉన్నప్పటికీ దేశంలోని మొత్తం ఆహార ఉత్పత్తిలో అది చాలా తక్కువ. ప్రపంచంలో ఎక్కువగా సహార చుట్టు పక్కల ఉన్న ఆఫ్రికన్? దేశాల్లో, ఆసియా అంతటా ఉన్న చిన్న కమతాల రైతులే వీటిని పండిస్తున్నారు. ఈ పంటలు ఫుడ్?, పశువుల మేత, బయో ఫ్యుయెల్స్?ని అందిస్తున్నాయి. ప్రస్తుతం మన దేశం ఏటా దాదాపు 170 లక్షల టన్నుల మిల్లెట్స్?ని ఉత్పత్తి చేస్తుంది. 2017%--%-18 నుండి 2020%--%-21 సంవత్సరాల్లో సగటున 11 శాతం విస్తీర్ణంలోనే మిల్లెట్స్? పండిస్తున్నారు. ఇది మొత్తం ఆహార ఉత్పత్తుల్లో కేవలం 6 శాతం మాత్రమే. అయినా.. ఆసియాలోని మిల్లెట్స్ ప్రొడక్షన్?లో? 80 శాతం ఇండియాదే. అందులోనూ రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి. మన దేశం 2021 -22లో 34.32 మిలియన్ యూఎస్ డాలర్ల విలువైన మిల్లెట్స్?ని ఎగుమతి చేసింది. 2020 - 21లో 26.97 మిలియన్ డాలర్లు, 2019 -20లో 28.5 మిలియన్ డాలర్ల విలువైన మిల్లెట్స్? ఎగుమతి చేసింది. ఇండియా నుంచి ఎక్కువగా యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, లిబియా, ఒమన్, ఈజిప్ట్, ట్యునీషియా, యెమెన్, యూకే, అమెరికాలు దిగుమతి చేసుకుంటున్నాయి. అయితే.. ఇండోనేసియా, బెల్జియం, జపాన్, జర్మనీ, మెక్సికో, ఇటలీ, యూఎస్, ఇంగ్లాండ్, బ్రెజిల్, నెదర్లాండ్స్ దేశాలు ఇతర దేశాల నుంచి మిల్లెట్స్‌ని ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాయి.

### అందానికి కూడా..

మిల్లెట్స్‌లో విటమిన్ -సి, ఇ ఉంటాయి. ఇవి నేచురల్ సన్‌స్క్రీన్‌లుగా పనిచేస్తాయి. ఎండవల్ల స్కిన్ దెబ్బతినకుండా, డల్‌గా, డార్క్‌గా మారకుండా కాపాడతాయి. కొత్త స్కిన్ సెల్స్ పుట్టేందుకు సాయం చేస్తాయి. అంతేకాదు.. మిల్లెట్స్ స్కిన్‌ని ఎప్పుడు హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. పొడిబారకుండా కాపాడతాయి. యాంటీ ఏజింగ్‌కు కూడా బాగా పనికొస్తాయి. వయసు మీద పడిందనడానికి సూచనలు.. నల్ల మచ్చలు, మొటిమలు, ముడతలు. అవి రాకుండా మిల్లెట్స్ స్కిన్‌ని కాపాడతాయి. రోజూ మిల్లెట్స్ తింటే జుట్టుకు కూడా బలం. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ఇవి తలపై బ్లడ్ సర్క్యులేషన్‌ని పెంచుతాయి. దాని వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.

### కొన్నేండ్ల నుంచి..

ఇప్పటికే కొన్నేండ్ల నుంచి మిల్లెట్స్?కు డిమాండ్? పెరుగుతూ వస్తోంది. కాకపోతే.. ఇదివరకు పల్లెల్లో ప్రజలే ఎక్కువగా వీటిని తినేవాళ్లు. ఇప్పుడు సిటీల్లో ఉండే ప్రజలు తినడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే.. ఇదివరకు ఇవి బియ్యం కంటే తక్కువ ధరకు దొరికేవి. కానీ.. ఇప్పుడు సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల దాదాపు చాలా రకాల మిల్లెట్స్? బియ్యం కంటే చాలా ఎక్కువ రేటు ఉన్నాయి. అందుకే ఆదాయం ఎక్కువగా ఉన్నవాళ్లే వీటిని తింటున్నారు. సాగు విస్తీర్ణం పెరిగి, ప్రొడక్షన్? పెరిగితే.. బియ్యం కంటే తక్కువ ధరకు దొరికే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే వీటికి మార్కెట్ కూడా బాగానే ఉంది. కొన్ని కంపెనీలు ఇప్పుడు ట్రెండ్? ఫాలో అవుతూ... రకరకాలుగా మార్కెట్ చేస్తున్నారు. ఉదాహరణకు బాజ్రా ఫ్లేక్స్, జొవార్ ఫ్లేక్స్, జొన్న పిండితో చేసిన పాన్‌కేక్ మిక్స్, రాగి, జోవర్ దోస మిక్స్, రాగితో చేసిన డెజర్ట్ మిక్స్ లాంటివి మార్కెట్?లో ఉన్నాయి. అందులోనూ కొన్ని బ్రాండ్‌లు "క్లీన్ లేబుల్ సర్టిఫికెట్", "వంద శాతం హోల్‌గ్రెయిన్ సర్టిఫికెట్" తీసుకుని ప్రొడక్ట్స్‌ని మార్కెట్‌లోకి తెస్తున్నాయి.

### లాభాలెన్నో..

ప్రకృతి మనకు ప్రసాదించిన గొప్ప కానుకలు మిల్లెట్స్?. కానీ.. మనలో చాలామంది వాటిని పట్టించుకోవడంలేదు. అవి మన బాడీకి అనేక రకాల రోగాలను ఎదుర్కోవడంలో సాయం చేస్తాయి.

### అవసరమా?

మిల్లెట్స్? సాగును పెంచాల్సిన అవసరం ప్రపంచానికి ఎంతగానో ఉంది. ఎందుకంటే.. కొన్నేండ్ల నుంచి ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గ్లోబల్? వార్మింగ్?, పెరుగుతున్న నీటి కొరత, తక్కువ సాగు భూమి, ఎక్కువ జనాభా లాంటి ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా... మిల్లెట్స్? సాగు తప్పనిసరిగా చేయాలని చెప్తున్నారు సైంటిస్ట్?లు. పైగా మన జనాభాలో 14 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సమస్యను తీర్చే శక్తి మిల్లెట్స్?కు ఉందని ఎక్స్?పర్ట్స్? చెప్తున్నారు. మిల్లెట్స్? తినడం ఇండియన్స్?కి కొత్తేమీ కాదు. హరిత విప్లవానికి ముందు అందరూ ఇవే తిన్నారు. పైగా వీటితో అనేక రకాల సంప్రదాయ వంటకాలు చేసుకోవచ్చు. అంతెందుకు వీటితో రెడీ టు కుక్?, రెడీ టు ఈట్? ఫుడ్స్? కూడా అందుబాటులోకి తీసుకురావొచ్చు.

### మన దగ్గర పండించేవి...

ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయంగా పండే అనేక రకాల మిల్లెట్స్ ఉన్నాయి. మన దగ్గర మాత్రం ఎక్కువగా జొన్నలు (జొవార్), సజ్జలు (పెర్ల్ మిల్లెట్), రాగులు(ఫింగర్ మిల్లెట్), లిటిల్ మిల్లెట్ (చామలు), ఫాక్స్‌టైల్ మిల్లెట్ (కొర్రలు), ప్రోసో మిల్లెట్ (వరిగెలు), బార్న్యార్డ్ మిల్లెట్ (ఊదలు), కోడో మిల్లెట్(అరికలు) పండిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్?లో వీటి రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. జొన్నలు, సజ్జలు, రాగుల రేట్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. 2017 - 18లో జొన్నల కనీస మద్దతు రేటు 1,725 రూపాయలు ఉండేది. 2022 - 23కి 2,990 రూపాయలకు పెరిగింది. అలాగే సజ్జల రేటు 1,425 నుంచి 2,350కి, రాగుల రేటు 1,900 నుంచి 3,578కి పెరిగాయి.

### మిల్లెట్ మిషన్

మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వినియోగం పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. అందులో భాగంగానే మిల్లెట్స్ సాగును ప్రోత్సహిస్తోంది. మిల్లెట్స్? ప్రమోషన్ కోసం దేశంలోని కొన్ని సిటీల్లో మిల్లెట్ ఎక్స్‌పోలను ఏర్పాటు చేస్తున్నారు. తంజావూరులో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మిల్లెట్ ప్రాసెసింగ్ (ఐఎస్ఎంపీ)ని ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉంది. మిల్లెట్ మిషన్‌లో భాగంగా ఇండియాని గ్లోబల్ మిల్లెట్స్ హబ్‌గా మార్చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అంతేకాదు.. గతేడాది డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని అఖిల పక్ష ఎంపీలకు మిల్లెట్స్ ఫుడ్‌తో లంచ్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జరిగే జీ%--% 20 సదస్సులో కూడా అన్ని రకాల ఫుడ్ వెరైటీలను మిల్లెట్స్?తోనే వండుతామని కేంద్ర మంత్రి జై శంకర్? చెప్పారు.

### బడ్జెట్‌లో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023%--%24 వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యంగా వ్యవసాయం, రైతుల కోసం కొన్ని పథకాలను ప్రస్తావించారు. అందులో దేశ వ్యాప్తంగా రైతులను ఎట్రాక్ట్ చేసిన పథకం 'శ్రీ అన్న యోజన'. మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఈ స్కీంని తీసుకొచ్చారు. ప్రసంగంలో మిల్లెట్స్‌ని 'శ్రీ అన్న' అన్నారు. అలా పలకడం వెనక ఉన్న కారణాన్ని తర్వాత మోదీ కర్నాటకలో ఒక బహిరంగ ర్యాలీలో చెప్పారు. కర్నాటకతోపాటు సౌత్ ఇండియాలోని కొన్ని ప్రాంతాల్లో మిల్లెట్స్?ని 'సిరి ధాన్యం' అని పిలుస్తారు. దాన్ని వ్యవహారికంలో 'శ్రీ ధాన్యం' కూడా అంటారు. అందుకే మిల్లెట్స్?ని 'శ్రీ అన్న' అని పిలుస్తున్నారు. అంతేకాదు 'శ్రీ అన్న' అంటే అన్ని ఆహార ధాన్యాల్లో అత్యుత్తమమైనది అనే అర్థం కూడా ఉందన్నారు. మిల్లెట్స్? రుచిగా ఉండడంతో పాటు వాటిలో పోషకాలు పుష్కలంగా ఉండడం వల్ల కర్ణాటకలో 'శ్రీ ధాన్యం' అని పిలుస్తున్నారని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

### ఎన్నికల మేనిఫెస్టోలో

సెంట్రల్? గవర్నమెంట్ మిల్లెట్ మిషన్ తీసుకొచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మిల్లెట్స్ సాగు, వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. కర్నాటకలో ఈ మధ్య జరిగిన ఎన్నికలప్పుడు బీజేపీ పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. అందులో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి నెలా 5 కిలోల బియ్యంతో పాటు 5 కిలోల మిల్లెట్స్? అందిస్తామని చెప్పారు.


### ాయుధ బలగాలకు మిల్లెట్స్

కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సెంట్రల్ ఆర్మ్‌డ్‌పోలీస్ ఫోర్స్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)కు పెట్టే భోజనంలో 30శాతం మిల్లెట్స్ అందించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మధ్యే నిర్ణయం తీసుకుంది. అందుకోసం మిల్లెట్ బేస్‌డ్ మెనూను రెడీ చేయాలని బలగాలకు చెప్పింది.

### యూపీలో ప్రత్యేక పథకం

ఉత్తరప్రదేశ్ గవర్నమెంట్ కూడా మిల్లెట్స్‌ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఒక పథకాన్ని తీసుకొచ్చింది. "ఉత్తరప్రదేశ్ మిల్లెట్స్ రివైవల్ ప్రోగ్రామ్"లో భాగంగా రాష్ట్రంలోని 75 జిల్లాల్లో రైతులకు ప్రతి సంవత్సరం మిల్లెట్స్? విత్తనాల మినీ కిట్‌ను ఫ్రీగా ఇస్తారు. ఈ ఏడాది మొదలైన ఈ పథకం నాలుగేండ్ల వరకు కొనసాగుతుంది. అంతేకాకుండా ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు.

# శుక్లాల ఆపరేషన్.. అపోహలు వద్దు



కంటికి కనిపిస్తున్న ప్రపంచం క్రమంగా మసక మసకగా మారితే? రంగులు వెలిసిపోతే? తెలిసినవారి ముఖాలనూ పోల్చుకోలేకపోతే? బల్బుల చుట్టూ కాంతి ఆవరించి ఇబ్బంది పెడుతుంటే? ఊహించుకోవటానికే కష్టంగా అనిపిస్తోంది కదా. శుక్లాల (కాటరాక్ట్) సమస్యతో బాధపడేవారి పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇందులో పారదర్శకంగా ఉండే కంటి కటకం మీద మందంగా, మబ్బు మాదిరిగా పొర ఏర్పడుతుంది. దీంతో అంతా మసక మసకగా కనిపిస్తుంది. నెమ్మదిగా, ఎలాంటి హెచ్చరికలు లేకుండా దాడి చేసే దీనికి సురక్షితమైన, సమర్థమైన శస్త్రచికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ అపోహలు, భయాలతో చాలామంది వెనకాడుతుంటారు. వీటిని తొలగించుకోవటం చాలా ముఖ్యం.

ముదరకముందే శుక్లం పూర్తిగా ముదిరిన తర్వాతే శస్త్రచికిత్స చేయించుకోవాలని కొందరు భావిస్తుంటారు. ఇది పూర్తిగా అపోహే. సమస్య ముదిరేంత వరకూ వేచి చూస్తుంటే చూపు దెబ్బతినే ప్రమాదముంది. వీలైనంత త్వరగా చేయించుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. సర్జరీలో మబ్బు పొరను తొలగించి, కృత్రిమ కటకాన్ని అమరుస్తారు. మీనమేషాలు లెక్కిస్తుంటే కోలుకోవటం ఆలస్యమవుతుంది. శస్త్రచికిత్స చేయటమూ సంక్లిష్టం కావొచ్చు. కాబట్టి ముదిరేంత వరకు చూడాలనుకోవటం తప్పు. చికిత్స చేయించుకున్న 24 గంటల్లోనే చూపు మెరుగవుతుందని గుర్తించాలి. కొద్దిరోజుల్లోనే తిరిగి మామూలుగా అన్ని పనులు చేసుకోగలుగుతారు.

### కాలాలతో పనిలేదు

కొందరు చలికాలంలో శుక్లాల శస్త్రచికిత్స చేయించుకుంటే బాగా పనిచేస్తుందని అనుకుంటుంటారు. కళ్లకు కాలాలతో నిమిత్తం లేదు. ఎండాకాలం, వానాకాలం, చలికాలం ఎప్పుడైనా శస్త్రచికిత్స సురక్షితమే. కొన్నిరోజుల పాటు స్నానం చేస్తున్నప్పుడు కళ్లలోకి నీళ్లు వెళ్లకుండా చూసుకుంటే చాలు. వారం పది రోజుల్లోనే రోజువారీ పనులు హాయిగా చేసుకోవచ్చు. రెండో కంటికి శస్త్రచికిత్స చేయించుకోవటానికి నెలల కొద్దీ ఆగాల్సిన పనిలేదు కూడా. దీన్ని ఎప్పుడు చేయించుకోవటం మంచిదో డాక్టర్‌ను అడిగి తెలుసుకోవాలి.

### నొప్పి పుట్టదు

శుక్లాల ఆపరేషన్‌తో నొప్పి పుడుతుందని, కళ్లలోకి సూది గుచ్చుతారని చాలామంది భయపడుతుంటారు. నేటి కాటరాక్ట్ సర్జరీలో చుక్కల మందుతోనే మొద్దుబారేలా చేస్తారు. ఎలాంటి సూదులు, ఇంజెక్షన్లు ఉండవు. చాలా కేసుల్లో కుట్లతోనూ పనుండదు. కేవలం 10-15 నిమిషాల్లోనే శస్త్రచికిత్స పూర్తవుతుంది. చాలామంది అప్పుడే అయిపోయిందా అనీ ఆశ్చర్యపోతుంటారు. ఇంతకాలం ఎందుకు భయపడ్డామా అని భావిస్తుంటారు కూడా.

### వృద్ధులకు మాత్రమే కాదు

శుక్లాలకు వయసు మీద పడటం ప్రధాన కారణమే అయినప్పటికీ చిన్నవారికి రాకూడదనేమీ లేదు. కొందరికి పుట్టుకతోనే ఉండొచ్చు. బాల్యంలో రావొచ్చు. కళ్లకు దెబ్బలు తగలటం, దీర్ఘకాలంగా స్టిరాయిడ్లు వాడటం, మధుమేహం నియంత్రణలో లేకపోవటం, అతి నీలలోహిత కిరణాల ప్రభావానికి ఎక్కువగా గురికావటం వల్ల ఎవరికైనా శుక్లాలు తలెత్తొచ్చు. అందువల్ల చూపు మసక మసకగా మారితే వయసుతో నిమిత్తం లేకుండా ఒకసారి కంటి డాక్టర్‌ను సంప్రదించటం మంచిది. లేనిపోని అపోహలతో వెనకాడితే సమస్య నిర్ధారణ కాదు. శుక్లం లోలోపలే ముదురుతూ వస్తుందని గుర్తించా

# గిల్ సరికొత్త చరిత్ర.. కోహ్లీ రికార్డు బద్దలు

**స్వదేశంలో అత్యంత వేగంగా 1000 వన్డే పరుగులు చేసిన గిల్**

**ఈ క్రమంలో విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించిన యువ బ్యాటర్**

**లిస్ట్ ఏ క్రికెట్‌లో 14,000 పరుగులు పూర్తి చేసిన రోహిత్ శర్మ**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అరుదైన రికార్డు సృష్టించాడు. స్వదేశంలో వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అతను బద్దలుకొట్టాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో ఈ ఘనత సాధించాడు. అద్భుతమైన ఫామ్‌తో ఆకట్టుకున్న గిల్, ఈ మ్యాచ్‌లో అర్ధశతకం పూర్తి చేసి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు.
ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా మరో మైలురాయిని అందుకున్నాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో 14,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. తుది జట్టులోకి కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్ కూడా వచ్చారు. ఇక, ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేస్తున్న భారత్ 30 ఓవర్లు ముగిసేరికి 2 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది.
మూడు వన్డేల ఈ సిరీస్‌లో ఇప్పటికే భారత్ శుభారంభం చేసింది. తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

# రెండో వన్డే: టాస్ గెలిచిన ఆఫ్ఘన్.. టీమిండియాలో కొత్త ప్లేయర్ అరంగేట్రం



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసేందుకు టీమిండియా సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న భారత్, ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తుండగా, సిరీస్‌లో నిలవాలంటే ఆఫ్ఘనిస్థాన్‌కు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు యాజమాన్యం మరో యువ ఆటగాడికి అవకాశం కల్పించింది. యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు అరంగేట్రం చేసే అవకాశం ఇచ్చింది. దీంతో ఈ సిరీస్‌లో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన మూడో ఆటగాడిగా ప్రిన్స్ నిలిచాడు. తొలి వన్డేలో హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ తమ అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. క్వాడ్ సమస్యల కారణంగా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడని జట్టు యాజమాన్యం తెలిపింది. ప్రిన్స్ యాదవ్‌తో పాటు యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్ కూడా తుది జట్టులోకి వచ్చారు.
టాస్ గెలిచిన అనంతరం ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది మాట్లాడుతూ.. "వికెట్ తాజాగా కనిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అందుకే బౌలింగ్ ఎంచుకున్నాం. గత మ్యాచ్‌లో మేం బాగానే ఆడినా భాగస్వామ్యాలు నెలకొల్పడంలో విఫలమయ్యాం. ఒకే ఒక్క భాగస్వామ్యం తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయాం. ఈసారి బలంగా పుంజుకుంటామని ఆశిస్తున్నాం. మా కుర్రాళ్లకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. జట్టులో మూడు మార్పులు చేశాం. నబీ అనారోగ్యంతో, అజ్మత్ గాయంతో దూరమయ్యారు. జియా ఉర్ రెహ్మాన్ కూడా ఆడటం లేదు. వారి స్థానంలో బిలాల్, దర్విష్ రసూలీ, మరో ఆటగాడు జట్టులోకి వచ్చారు" అని తెలిపాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. "మేం కూడా టాస్ గెలిచి ఉంటే బౌలింగే ఎంచుకునేవాళ్లం. ప్రస్తుతం ఐదుగురు బౌలర్లతోనే ఆడాల్సి వస్తోంది. కఠిన పరిస్థితులను ఎదుర్కోవడం, భారీ స్కోర్లను ఛేదించడం, బౌలింగ్‌లో పదునుగా రాణించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాం. జట్టులో మూడు మార్పులు జరిగాయి. ప్రిన్స్ అరంగేట్రం చేస్తున్నాడు. అతనితో పాటు కుల్దీప్, జైస్వాల్ కూడా జట్టులోకి వచ్చారు" అని చెప్పాడు.
ధర్మశాలలో వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పలువురు సీనియర్ ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడంతో యువ ఆటగాళ్లకు ఈ సిరీస్ మంచి అవకాశంగా మారింది.

**తుది జట్లు:**

భారత్: యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.ఆఫ్ఘనిస్థాన్: రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), దర్విష్ రసూలీ, రషీద్ ఖాన్, నంగ్యాలియా ఖరోటి, ఏఎం ఘజన్ఫర్, మహ్మద్ సలీం సఫీ, బిలాల్ సమీ.

# వైభవ్‌తో వాగ్వాదం.. శ్రీలంక క్రికెటర్‌కు జరిమానా!



**హైదరాబాద్ పెన్ పవర్:** యువ సంచలనం వైభవ్ సూర్యవంశీతో మైదానంలో ఘర్షణకు దిగిన శ్రీలంక 'ఏ' ఆటగాడు విషెన్ హలంబగేపై ఆ దేశ క్రికెట్ బోర్డు (ఎస్‌ఎల్‌సీ) కఠిన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశ్ అందించిన అంపైర్ల నివేదిక ఆధారంగా హలంబగేకు భారీ జరిమానా విధించినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఐసీసీ తరహాలో ఎలాంటి అధికారిక విచారణలు నిర్వహించకుండానే లంక బోర్డు నేరుగా ఈ శిక్ష ఖరారు చేయడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగిందంటే**

భారత్-ఏ, శ్రీలంక-ఏ జట్ల మధ్య దంబుల్లా వేదికగా జరిగిన మ్యాచ్ చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగింది. మ్యాచ్ టై అవ్వడంతో సూపర్ ఓవర్‌కు దారితీయగా.. భారత్‌కు చివరి మూడు బంతుల్లో 14 పరుగులు అవసరమైన దశలో వైభవ్ క్రీజులో ఉన్నాడు. అయితే ఆ తీవ్రమైన ఒత్తిడిలో వైభవ్ జట్టును గెలిపించలేకపోయాడు. భారత్ ఓడిపోవడంతో లంక ఆటగాళ్లు హద్దులు దాటి ప్రవర్తించారు.

**స్లెడ్జింగ్‌తో పెరిగిన ఉద్రిక్తత**

నిరాశతో పెవిలియన్ వైపు నడుస్తున్న 15 ఏళ్ల వైభవ్‌ను లక్ష్యంగా చేసుకుని శ్రీలంక ఆటగాళ్లు అవహేళన చేయడం మొదలుపెట్టారు. దాంతో భారత ఆటగాడు సూర్యాంశ్ షెడ్గే రంగంలోకి దిగి లంక ప్లేయర్లను నిలదీశాడు. ఆ వెంటనే వైభవ్ కూడా ముందుకు రావడంతో ఇరు జట్ల ఆటగాళ్లు ఒకరినొకరు తోసుకునే వరకు వెళ్లింది. ఈ విజువల్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి.

**వైభవ్‌పై బీసీసీఐ నో యాక్షన్**

ఈ ఘర్షణకు శ్రీలంక ఆటగాళ్ల అతి ప్రవర్తనే కారణమని భావించిన బీసీసీఐ వైభవ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తదుపరి మ్యాచ్‌కు అతడు ఆడేందుకు అవకాశం ఇచ్చారు.

**కౌన్సిలింగ్ అవసరం**

ఈ హై-వోల్టేజ్ డ్రామా నేపథ్యంలో భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే కీలక వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్‌ల్లో ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఎదురైనప్పుడు ఆటగాళ్లు తమ భావోద్వేగాలను ఎలా అదుపులో ఉంచుకోవాలో నేర్చుకోవాలని చెప్పారు. ముఖ్యంగా యువ ఆటగాళ్ల ప్రవర్తనపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాక్ టెయిల్2 'అల్లీ' లుక్‌లో కృతి సనన్ రచ్చ.. ఎమోషనల్ పోస్ట్ వైరల్!

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ నటించిన క్రేజీ రోమాంటిక్ కామెడీ డ్రామా 'కాక్ టెయిల్ 2' జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో ఆమె 'అల్లీ' అనే చాలా డిఫరెంట్, బోల్డ్ క్యారెక్టర్‌ను ప్లే చేశారు. రీసెంట్‌గా విడుదలైన ఈమె లుక్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ఈ నేపథ్యంలో తనను ఇంత అందంగా, హాట్‌గా చూపించిన తన కాస్ట్యూమ్ డిజైనర్స్, మేకప్ టీమ్, మరియు డైరెక్టర్‌కు థాంక్స్ చెబుతూ కృతి సనన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది.

**'అల్లీ' లుక్‌కు సూపర్ రెస్పాన్స్:**

షాహిద్ కపూర్, రష్మిక మందన్నలతో కలిసి కృతి సనన్ నటించిన 'కాక్ టెయిల్ 2' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. హోమి అడజానియా డైరెక్ట్ చేసిన ఈ సినిమాలో కృతి సనన్ సరికొత్త మోడ్రన్ లుక్‌లో కనిపిస్తున్నారు. తన 'అల్లీ' క్యారెక్టర్ లుక్స్‌పై ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్ చూసి కృతి ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ క్రెడిట్ అంతా తన వెనుక ఉన్న టీమ్‌దే అంటూ ఇన్‌స్టాలో ఒక స్పెషల్ నోట్ రాసుకొచ్చారు.

**హాట్ అండ్ బ్యూటిఫుల్ కాంబినేషన్:**

"అల్లీ క్యారెక్టర్ నాకు ఒక విషయం నేర్పింది.. హాట్‌గా ఉండటం, బ్యూటిఫుల్‌గా ఉండటం వేర్వేరు కాదు, రెండు కలిస్తేనే అల్లీ" అంటూ కృతి పేర్కొన్నారు. తను కెరీర్‌లో చేసిన క్యారెక్టర్స్‌లో అల్లీ చాలా ఫ్రీ-స్పిరిటెడ్, ఎవరికీ జడ్జ్ చేయని ఒక క్రేజీ క్యారెక్టర్ అని చెప్పారు. ఆ క్యారెక్టర్‌కు తగ్గట్టే తన ఫ్యాషన్ కూడా ఎంతో కేర్ ఫ్రీగా, బ్యూటిఫుల్ ఛాటిక్‌గా ఉంటుందని కృతి వివరించారు.

**స్టైలిస్ట్ అనైతాకు స్పెషల్ థాంక్స్:**

ప్రముఖ స్టైలిస్ట్ అనైతా ష్రాఫ్ అదజానియాకు కృతి సనన్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేవలం బట్టలు డిజైన్ చేయడం మాత్రమే కాకుండా, క్యారెక్టర్ పర్సనాలిటీకి తగ్గట్టుగా లుక్స్ ప్లాన్ చేయడంలో అనైతా గ్రేట్ అని పొగిడారు. ఇక ప్రేక్షకులకు తనలో ఒక సరికొత్త యాంగిల్‌ను చూపించినందుకు థాంక్స్ చెప్పారు. అలాగే అసోసియేట్ స్టైలిస్ట్ సుకృతి గ్రోవర్ హార్డ్ వర్క్‌ను కూడా మెచ్చుకున్నారు.

**బీచ్ హెయిర్, సన్‌కిస్డ్ లుక్ అదిరింది:**


ఈ సినిమాలో కృతి సనన్ హెయిర్ స్టైల్, మేకప్ కూడా చాలా కొత్తగా ఉన్నాయి. ఆసిఫ్ అహ్మద్, అడ్రియన్ జాకబ్స్ తనతో ఎన్నో సినిమాలు చేసినా, ఈసారి తనను సరికొత్తగా ప్రెజెంట్ చేశారని కృతి చెప్పారు. ముఖ్యంగా 'అల్లీ' బీచ్ హెయిర్ స్టైల్, బ్రాంజ్డ్ సన్‌కిస్డ్ లుక్ ఇప్పుడు విపరీతంగా ట్రెండ్ అవుతోందని, దానికి సపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ అయిందని మురిసిపోయారు.

**కెప్టెన్ ఆఫ్ ద షిప్ హోమి:**

సినిమా డైరెక్టర్ హోమి అడజానియాను 'మాస్టర్ మైండ్' అని పిలుస్తూ కృతి ఎమోషనల్ అయ్యారు. అల్లీ క్యారెక్టర్‌ను ఇంత కూల్‌గా డిజైన్ చేసినందుకు, తనను నమ్మినందుకు థాంక్స్ చెప్పారు. నిజానికి హోమి పర్సనాలిటీ నుంచే తాను చాలా విషయాలు అల్లీ క్యారెక్టర్ కోసం తీసుకున్నానని సరదాగా కామెంట్ చేశారు. అలాగే ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో రియలిస్టిక్‌గా, బ్యూటిఫుల్‌గా చూపించిన డీఓపీ శాంతాను కూడా మెచ్చుకున్నారు. "ఆ లొకేషన్లలో నిలబడినప్పుడు ఎంతో గ్రేట్‌ఫుల్‌గా, బ్యూటిఫుల్‌గా, పక్కా అల్లీలా ఫీల్ అయ్యాను" అంటూ కృతి తన పోస్ట్‌ను ముగించారు. జూన్ 19న విడుదల కాబోతున్న 'కార్టెయిల్ 2'లో కృతి సనన్ నటన, గ్లామర్ ఏ రేంజ్‌లో ఉంటాయో తెలియాలంటే థియేటర్లలో చూడాల్సిందే. ఇక ఏదేమైనా ఈ సినిమాతో కృతి తన కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ లుక్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైపోయింది.



పూజా హెగ్డే స్టైలిష్ లుక్ వైరల్





గ్లామరస్ కొత్త లుక్‌లో మెరిసిపోతున్న ప్రగ్యా జైస్వాల్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965